విశాఖపట్టణం
ఆదివారం 19 ఏప్రిల్ 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 85 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# పవన్‌కు సర్జరీ

సమీక్షలో

తీవ్ర అస్వస్థత

పూర్తి స్వస్థతకు

పది రోజుల విశ్రాంతి

వైద్యుల సలహా



2



## చంద్రబాబుకు అదే పరిస్థితి

నితీశ్, ఏక్‌నాథ్ వలె కావొచ్చు

సీట్లు కోసమే టీడీపీతో జట్టు

బీజేపీ బలం పెరిగితే టీడీపీ అవుట్

బీజేపీతో పొత్తు పార్టీల పరిస్థితి ప్రశ్నార్థకమే

మీడియా చిట్ చాట్‌లో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశంలో బీజేపీతో పొత్తుపెట్టుకున్న పార్టీల మనగడ ప్రశ్నార్థకమే.. అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లో నితీష్ కుమార్, మహారాష్ట్రలో ఎక్‌నాథ్ షిండే పరిస్థితి చూస్తూనే ఉన్నామని.. రేపు టీడీపీ, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే ..మిగతా 2లో

# మహిళా బిల్లును ఓడించడం దుర్మార్గం

జాతి ద్రోహం చేయడంతో సమానం

విపక్షాలకు వదిలిపెట్టేది లేదు

సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

నిడదవోలు

ఎన్డీఏ నిరసన ర్యాలీకి హాజరు





(ఏలూరు - జయజయహే)

కాంగ్రెస్, మిత్రపక్షాలు మహిళా బిల్లును అడ్డుకున్నాయని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు మహిళల రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై నిరసన ర్యాలీని చేపట్టాయి. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ నిరసన ప్రదర్శన కార్యక్రమంలో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడమనేది ద్రోహమంటూ ప్లకార్డులతో నిరసన చేపట్టారు. మహిళలకు ద్రోహం చేయడం జాతి విద్రోహంతో సమానమని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళలను గౌరవించి అన్ని రంగాల్లో ఆదరించడం సంస్కృతి అని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలకు భిన్నంగా ద్రోహం చేశారని ఎద్దేవా చేశారు. ఇది ప్రారంభం మాత్రమేనని, మహిళా లోకమంతా ఏకమైందని వివరించారు. పోరాడి సాధించుకునే సమయంలో అడ్డుకోవడం క్షమించరాని నేరమన్నారు. అదేవిధంగా మహిళలు ఆత్మగౌరవంతో బతకాలనే నినాదంతో ముందుకెళ్లాలని సీఎం సూచించారు. చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని విపక్షాలు ఆరోపించాయని సీఎం చంద్రబాబు తెలిపారు. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్రం స్పష్టత ఇచ్చిందన్నారు. మహిళల రిజర్వేషన్ల కోసం మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నామని గుర్తు ..మిగతా 2లో

# క్షమించరాని తప్పు.. శిక్ష తప్పదు

మహిళలకు వారంతా సమాధానం చెప్పాలి

ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర వ్యాఖ్యలు

కేబినెట్ భేటీలో సహచరులతో చర్చ

ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

డీలిమిటేషన్ బిల్లు విషయంలో అధికార విపక్షాల మధ్య విమర్శల పర్వం కొనసాగుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న ప్రతిపక్షాలు పెద్ద తప్పు చేశాయని ప్రధానమంత్రి మోదీ అంటుంటే, శాశ్వతంగా దేశాన్ని పాలించాలనే కుట్రను భగ్నం చేశామని, గతంలోనే ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని విపక్షాలు డిమాండే చేస్తున్నాయి. మొత్తానికి బిల్లు ఆమోదం పొందకుండానే పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా ..మిగతా 2లో



## మహిళా శక్తిని అడ్డుకున్నారు

భవిష్యత్తులో

ఎదకుండా చేస్తున్నారు

ఈ పాపం వారిని వదలనీయదు

ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడి

జాతినుద్దేశించి

ప్రసంగంలో

కీలక వ్యాఖ్యలు 2





## బీజేపీకి బానిసగా మారారు

వైఎస్సార్ ఆత్మ ఘోషిస్తోంది

టీడీపీ, జనసేన కంటే బీజేపీని మోస్తారా

కేసుల నుంచి రక్షణ కోసమేనా

మాజీ సీఎం జగన్ పై పీసీసీ చీఫ్ షర్మిల మండిపాటు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్లు , డీలిమిటేషన్ బిల్లుల చుట్టూ సాగుతున్న రాజకీయ రగడ ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్, ..మిగతా 2లో



## రాష్ట్రానికి కొత్త రైల్వే లైన్లు

విశాఖ - రాజమండ్రి మధ్యప్రాజెక్టు

రూ.9,889 కోట్లతో రైల్వే కారిడార్

గోదావరిపై నాలుగు కి.మీ. మేర భారీ వంతెన


(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశ వ్యాప్తంగా సుమారు రూ.1,28,563 కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంది. రూ.12,980 కోట్లతో భారత్ మారిటైమ్ ఇన్సూరెన్స్ పూల్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భారతదేశ సముద్ర వాణిజ్యాన్ని అంతర్జాతీయ అనిశ్చితుల నుండి రక్షించడానికి ఇది ఉపయోగపడుతుంది. అలాగే విశాఖ-రాజమండ్రి 3,4 రైల్వే లైన్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏను 2 శాతం పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రూ. 6,791 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. అలాగే ప్రధాని ..మిగతా 2లో

# ఎకరాకి రూ. 40 వేలు.. ఐదేళ్లపాటు


లక్షన్నర వ్యవసాయ రుణ మాఫీ... ఏడాదికి రూ.3 వేలు కౌలు పెంపు

రైతులకు ముఖ్యమంత్రి ఆఫర్.. రెండో విడత భూ సమీకరణపై భేటీ



(అమరావతి - జయజయహే)

ఎకరానికి 40 వేల రూపాయల చొప్పున పదేళ్లపాటు కౌలు చెల్లిస్తామని రాజధాని రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక్కో కుటుంబానికి 1.50 లక్షల మేర వ్యవసాయ రుణ మాఫీ చేయనున్నట్లు రెండో విడత భూ సమీకరణపై రాజధాని రైతులతో సమావేశమైన సీఎం చంద్రబాబు వెల్లడించారు. సీఎంతో భేటీలో తాడికొండ, పెదకూరపాడు నియోజకవర్గాలకు చెందిన 10 గ్రామాల రైతులు పాల్గొన్నారు. రెండో విడత భూ సమీకరణకు భూములిచ్చిన రైతులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కౌలును ప్రకటించారు. అంతేకాకుండా ఏడాదికి రూ. 3 వేలు చొప్పున కౌలును పెంచేందుకు అంగీకరించారు. రాజధాని ..మిగతా 2లో



## సెకండ్ ఇంటర్‌కు ఇంప్రూవ్‌మెంట్

పాస్, ఫెయిల్ విద్యార్థులందరికీ ఛాన్స్

ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నో ఛాన్స్.. ఇంటర్ బోర్డు కీలక ప్రకటన

# మహిళా బిల్లును ఓడించడం దుర్మార్గం

**మొదటి పేజీ తరువాయి...**

చేశారు. పోరాడి సాధించుకునే సమయంలో అడ్డుకోవడం క్షమించరాని నేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష పార్టీలు ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతాయని విమర్శించారు. ఆడబిడ్డలను కేవలం ఇంటి వరకే పరిమితం చేయాలని దుర్మార్గ ఆలోచన తగదని సీఎం హితవు పలికారు. నిన్న విద్రోహ దినం, విపక్షాల ద్రోహాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలన్నారు. మహిళా సాధికారత కోసం అడ్డంకులు సృష్టించకూడదనే కర్తవ్యం విపక్షాలపై ఉందనిపేర్కొన్నారు. 2017లో అసెంబ్లీలో తీర్మానం చేసి పంపామని, 2029 నాటికి మహిళలకు రిజర్వేషన్ల అమలు యోచనతో కేంద్రం సహృదయంతో ముందుకొచ్చిందని తెలిపారు. ఇంట్లో ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేని పరిస్థితి ఉందని సీఎం



బాధపడ్డారు. మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లును ఓడించడం దుర్మార్గమైన చర్యని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే దీన్ని వదిలిపెట్టే సమస్య లేదని, విపక్షాలకు డిపాజిట్లు రాకుండా చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. అప్పుడే మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న విపక్షాల వైఖరికి నిరసనగా చేపట్టిన ర్యాలీ హెలిప్యాడ్ నుంచి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సభా వేదిక వరకు సాగింది. ఈ నిరసన ర్యాలీలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కూటమి నేతలంతా పాల్గొన్నారు.



# ఎకరాకి రూ. 40వేలు.. ఐదేళ్లపాటు

**మొదటి పేజీ తరువాయి...**

నిర్మాణానికి భూములిచ్చిన రైతులెవరికీ అన్యాయం జరగదని సీఎం చంద్రబాబు రైతులందరికీ హామీ ఇచ్చారు. ఈ భూముల్లో ప్రపంచస్థాయి రాజధాని నగరాన్ని నిర్మించే బాధ్యత తనదని చెప్పారు. రైతులే బ్రాండ్ అంబాసిడర్లుగా మారి భూసమీకరణ ప్రక్రియను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సీఎం కోరారు. హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ నిర్మాణం, అదే విధంగా ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని సైబరాబాద్‌గా అభివృద్ధి చేయడంతో అక్కడ జరిగిన అభివృద్ధి, అప్పట్లో రూ.లక్షల్లో ఉన్న భూముల విలువ ఇప్పుడు రూ.కోట్లలోకి చేరడం వంటి పరిణామాల్ని సీఎం చంద్రబాబు ఉదహరించారు. అదే రీతిలో అమరావతి సైతం అంతకుమించి అభివృద్ధి చెందుతుందని సీఎం తెలిపారు. అమరావతికి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకూడదనే చట్టబద్ధత కల్పించామని స్పష్టం చేశారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని భూ సమీకరణకు సహకరించాలని రాజధాని రైతులకు సీఎం చంద్రబాబు కోరారు. కేంద్రం పూర్తి సహాయ సహకారాలు అందించడంతో అమరావతి నిర్మాణం మరింత రెట్టింపు వేగంతో జరుగుతోందని చంద్రబాబు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎంద్రాయి, పెదమద్దూరు, వైకుంఠపురం, కర్లపూడి, పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం గ్రామాలకు చెందిన 70 మంది రైతులు పాల్గొన్నారు. ఈ భేటీలో కౌలు పెంపు, రుణమాఫీ వంటి అంశాలపై వారి డిమాండ్లను చంద్రబాబు ప్రధానంగా ప్రస్తావించారు. దానిపై పురపాలకశాఖ మంత్రి నారాయణ, తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, భాష్యం ప్రవీణ్‌లతో సీఎం చంద్రబాబు విడివిడిగా సమావేశమై చర్చించారు. కౌలు పెంపు, రుణమాఫీ ప్రకటన చేయడంతో రైతుల చప్పట్లతో వారి హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు. తమకు అభివృద్ధి చేసిన స్థలాల్ని ఇన్నర్ రింగ్ రోడ్డుకు లోపల ఇవ్వాలని కర్లపూడి గ్రామస్థులు కోరారు. తమకు ఒకచోట స్థలాలు ఇవ్వాలని ఎంద్రాయి, పెదమద్దూరు, కర్లపూడి, వైకుంఠపురం గ్రామాల రైతులు విజ్ఞప్తి చేశారు. కానీ వాటిపై సీఎం స్పష్టమైన హామీ ఇవ్వలేదని సమాచారం.

# బీజేపీకి బానిసగా మారారు

**మొదటి పేజీ తరువాయి...**

కాంగ్రెస్ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. ఈ క్రమంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పీసీసీ చీఫ్ షర్మిల సోషల్ మీడియాలో ఘాటు ట్వీట్ పోస్టు చేశారు. పార్లమెంటులో కీలకమైన బిల్లులపై ఓటింగ్ సందర్భంగా వైసీపీ వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. విపక్షం ముసుగులో ఉన్న జగన్ మోహన్ రెడ్డి, అసలు సిసలు ఆర్ఎస్ఎస్ పక్షపాతి అని ఈ ఓటింగ్ ద్వారా తేటతెల్లమైందని విమర్శించింది. టీడీపీ, జనసేనల కంటే ఎక్కువగా మోదీని మోయాల్సిన అవసరం జగన్‌కు ఏముందని ప్రశ్నించిన కాంగ్రెస్, రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే వైసీపీకి ముఖ్యమైపోయిందని ఆరోపించింది. అక్రమ డీలిమిటేషన్ బిల్లులకు మద్దతు పలికినందుకు జగన్ సిగ్గుపడాలని, తన ఐదేళ్ల పాలనలోని అవినీతి కేసుల నుంచి రక్షణ కోసమే ఆయన బీజేపీకి బానిసగా మారారని ఎద్దేవా చేసింది.

మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి సిద్ధాంతాలను జగన్ మంటగలిపారని, ఆయన వారసత్వం గురించి మాట్లాడే నైతిక హక్కును కోల్పోయారని కాంగ్రెస్ చీఫ్ మండిపడ్డారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే బిల్లులను విపక్షాలన్నీ ఏకమై అడ్డుకుంటే.. జగన్ మాత్రం గొర్రెలా గుడ్డిగా తలాడించడాన్ని ఆ పార్టీ నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. దక్షిణాది రాష్ట్రాల భావోద్వేగాలను, ప్రయోజనాలను అర్థం చేసుకోకుండా, సొంత రాష్ట్ర ప్రజల గుండెలను గాయపరుస్తూ బీజేపీకి జై కొట్టడం ప్రపంచంలో ఎక్కడా లేని వింత అని, జగన్ చేసిన ఈ నీచపు పని కి వైఎస్సార్ ఆత్మ ఘోషిస్తుందని షర్మిల ఆవేదన వ్యక్తం చేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని షర్మిల అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని, అసలు ఈ బిల్లు 2023లోనే ఆమోదం పొందిందని గుర్తు చేశారు. కేవలం మోదీ రాజకీయ లబ్ధి కోసం అక్రమంగా తెచ్చిన డీలిమిటేషన్ అంశాన్ని మాత్రమే విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయని, అది కూడా తెలియకుండా జగన్ మాట్లాడటం హాస్యాస్పదమని.. 2026 జనాభా లెక్కలు రాకుండా, కులగణన ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంఖ్య తేలకుండా సీట్లు పెంచడం దేశాన్ని మోసం చేయడమేనని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో బీజేపీ అంటే చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్ అని.. ఈ ముగ్గురూ మోదీ మెప్పు కోసం పాకులాడే వారేనని షర్మిల విమర్శించారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్షం ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, ప్రజల పక్షాన నిలబడి పోరాడేది తామేనన్నారు. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నా, చిన్న రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకోవాలన్నా కాంగ్రెస్ స్టాండ్ చాలా స్పష్టంగా ఉందని, కానీ జగన్ తన స్వార్థం కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని అన్నారు. షర్మిల ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.



# మహిళా శక్తిని అడ్డుకున్నారు

## భవిష్యత్తులో ఎదకుండా చేస్తున్నారు

## ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడి

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారి జాతినుద్దేశించి ప్రసంగించారు. భారత నారీశక్తి ఎదగకుండా అడ్డుకున్నారని ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. తాము దేశ, నారీ శక్తి హితం కోసం బిల్లు తెచ్చామన్న మోదీ, స్వార్థ రాజకీయాల కోసం విపక్షాలు నారీశక్తిని అడ్డుకున్నాయని అన్నారు. మహిళా బిల్లును కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ అడ్డుకున్నాయని, ఆ కుటుంబ పార్టీలు మహిళలను ఎదగనీయవని మోదీ ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు ఓడించింది బిల్లును కాదని మహిళా శక్తిని అని ప్రధాని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న పాపం వారిని వదిలిపెట్టదన్న మోదీ దేశ మహిళలు అన్ని విషయాలను గమనిస్తూనే ఉన్నారని తెలిపారు. తమ హక్కుల కోసం మహిళలు 40 ఏళ్లుగా పోరాడుతున్నారని, ఈ రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవటమంటే భ్రూణహత్య చేసినట్లే అని ధ్వజమెత్తారు. భారత అభివృద్ధిలో నారీశక్తి వాటా తక్కువేమీ కాదని, ఈ భ్రూణహత్యలో ప్రధాన పాపం కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ, డీఎంకే, పార్టీలదే అని ఆరోపణలు చేశారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అసత్యాలు ప్రచారం చేశాయని మోదీ అన్నారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికి నష్టం జరగదని తాను స్పష్టంగా చెప్పానని, అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం పెరుగుతుందని హామీ ఇచ్చానని గుర్తు చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందితే అన్ని రాష్ట్రాల్లో సీట్లు పెరిగేవని అన్న ప్రధాని సీట్లు పెరిగితే కాంగ్రెస్ టీఎంసీ, ఎస్పీ వంటి అన్ని పార్టీలకు ప్రయోజనంగానే ఉండేదని తెలిపారు. సంస్కరణలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకంగానే వ్యవహరిస్తుందని ప్రధాని ఆరోపించారు. 'కాంగ్రెస్ పార్టీ సంస్కరణలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకమే. ఆ పార్టీ చేసేవన్నీ నెగిటివ్ రాజకీయాలు. పేదల రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం. నోట్లరద్దు, జీఎస్టీ, డిజిటల్ పేమెంట్స్‌ను కూడా కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. అలాగే ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ రద్దు వంటి అన్నింటినీ కాంగ్రెస్ వ్యతిరేకించింది. అన్ని సంస్కరణలను అడ్డుకోవటమే ఆ పార్టీ సిద్ధాంతం. కాంగ్రెస్ విధానాల వల్ల దేశానికి తీవ్రనష్టం కలుగుతోంది. ఆ పార్టీ చేసిన పాపం ఇంతటితో పోయేది కాదు' అని కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు.

# క్షమించరాని తప్పు.. శిక్ష తప్పదు

**మొదటి పేజీ తరువాయి...**

పడినా పార్టీల మధ్య మాటల తూటాలు మాత్రం ఆగడం లేదు. ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ సీరియస్‌గా కనిపించారు. లోక్‌సభలో జరిగిన పరిణామాలపై సహచర మంత్రులతో చర్చించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకొని విపక్షాలు క్షమించరాని తప్పుచేశాయని మండిపడ్డారు. కచ్చితంగా క్షేత్రస్థాయిలో అడ్డుకున్న వారంతా శిక్ష అనుభవించాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. మహిళలకు వారంతా సమాధానం చెప్పాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. అంతకంటే ముందు బిల్లు వీగిపోవడంపై మాట్లాడిన ప్రియాంక మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై, బీజేపీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తొలిసారిగా ఎదురుదెబ్బ తగిలిందని, దీంతో దాని విధానాల అసలు స్వరూపం బయటపడిందని అన్నారు. మహిళల హక్కులను ఇకపై వాయిదా వేయలేమని, 2023లో ఆమోదించిన చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యూహం పని చేయదని పరిణామాలు స్పష్టం చేశాయని ప్రియాంక అన్నారు. దీనికి మోదీకి ఓ రాజకీయ ఎదురుదెబ్బగా అభివర్ణిస్తూ, ఇలాంటి పరిస్థితికి వారి అసంబద్ధమన విధానాలే కారణమని అన్నారు. దేశంలోని మహిళలు చాలా చైతన్యంగా ఉన్నారని కేవలం ప్రచారంతో వారిని ప్రభావితం చేయలేరని అన్నారు. నేడు మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు నిరంతరం పెరుగుతున్నాయి, వారు ప్రతి నిర్ణయాన్ని నిశితంగా గమనిస్తున్నారన్నారు. కేవలం మీడియా మేనేజ్మెంట్‌తో అసలు విషయం వెలుగులోకి రాకుండా పోదన్నారు. ఇప్పుడు కేవలం ప్రకటనలతో సమయం వృథా చేయద్దని, నిర్ణయాలు తీసుకునే సమయం వచ్చిందని ప్రియాంక చెప్పారు. పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని పేర్కొన్నారు. దాని అమలులో ఏవైనా సాంకేతిక అడ్డంకులు ఉంటే, వాటిని చిన్నపాటి సవరణల ద్వారా పరిష్కరించవచ్చని తెలిపారు. అంతే కానీ మహిళా రిజర్వేషన్ల ముసుగులో నియోజకవర్గాల పునర్విభజన ప్రణాళికకు మద్దతు ఇవ్వడం కుదరదని, ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే 2023 చట్టాన్ని అమలు చేయాలని సవాల్ చేశారు. శాశ్వతంగా అధికారంలో కొనసాగేందుకు మహిళా రిజర్వేషన్లను వాడుకోవడమే బీజేపీ కుట్ర అని ఆమె అన్నారు. లోక్‌సభలో ఆ పన్నాగాన్ని అడ్డుకున్నామని ఇది ప్రజాస్వామ్యానికి, ప్రతిపక్షాల ఐక్యతకు దక్కిన గొప్ప విజయమని అభిప్రాయపడ్డారు.0

# పవన్‌కు సర్జరీ

(అమరావతి - జయజయహే)

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుక్రవారం శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఉదయం అధికారులతో పాలనాపరమైన సమీక్ష నిర్వహిస్తుండగా ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గత కొన్ని నెలలుగా ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆయన, వ్యక్తిగత వైద్యుల సలహా మేరకు శుక్రవారం నాటి అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని ఆసుపత్రిలో చేరారు. వైద్యులు ఎం.ఆర్.ఐ పరీక్షలు నిర్వహించిన అనంతరం చిన్నపాటి శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వారం నుంచి పది రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు జనసేన అధ్యక్షుని రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి స్వస్థత చేకూరడానికి కొంత సమయం పడుతుందని, దీర్ఘకాలం పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందని వైద్యులు వెల్లడించారు.

# చంద్రబాబుకు అదే పరిస్థితి

**మొదటి పేజీ తరువాయి...**

అవుతుందంటూ పేర్కొన్నారు. ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేస్తూ.. పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో బీజేపీకి సీట్లు తక్కువగా ఉన్నాయని, అందుకే టీడీపీకి ప్రాధాన్యం ఇస్తున్నారని.. భవిష్యత్‌లో బీజేపీ బలం పెరిగితే టీడీపీని పక్కనపెడతారని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమే .. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగం.. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అన్నారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరు... ఆంధ్రప్రదేశ్ లో అపోజిషన్ కి కేవలం 11 సీట్లే ఉన్నాయి.. అలా అని ఆంధ్రప్రదేశ్ కు నేను రాజు అని చంద్రబాబు నాయుడు చట్టం తీసుకొస్తే ఒప్పుకుంటారా..? అని ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సూచించారు. అంతకుముందు మీడియాతో మాట్లాడిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేసే మోదీ కుట్రను ప్రజలంతా కలిసి ఓడించారన్నారు. డీలిమిటేషన్ బిల్లును పక్కనపెట్టి మహిళా రిజర్వేషన్ బిల్లును మళ్లీ సోమవారం సభలో పెట్టాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో వేరే వేరే ముసుగు తొడుక్కుని వస్తే తాము కచ్చితంగా గుర్తిస్తామన్నారు సీఎం రేవంత్. సీట్ల పెంపులో మోదీ ఎన్నుకున్న విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. కిషన్ రెడ్డి తనను విమర్శించడం మాని దక్షిణాదికి అన్యాయం జరగకుండా ప్రత్యామ్నాయం ఏంటో సూచించాలన్నారు సీఎం రేవంత్. మోదీ సంతోషం కోసమే కిషన్ రెడ్డి, లక్ష్మణ్ పని చేస్తున్నారన్నారు. తేజస్వి వ్యాఖ్యలను సీఎం రేవంత్ తప్పుబట్టారు. తెలంగాణపై మోదీ తరహాలోనే తేజస్వి కూడా మాట్లాడారన్నారు.

# రాష్ట్రానికి కొత్త రైల్వే లైన్‌లు

**మొదటి పేజీ తరువాయి...**

గ్రామీణ్ సడక్ యోజన పథకాన్ని మరో మూడేళ్ల పాటు పొడిగించాలని.. ఇందుకోసం రూ. 83,977 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా కొత్త రైల్వే ప్రాజెక్ట్‌లు, విస్తరణకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో ఘజియాబాద్ -- సీతాపూర్ 3వ, 4వ రైలు మార్గం కోసం రూ. 14,926 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. విశాఖ -రాజమండ్రి 3,4 రైల్వే లైన్ల నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. రూ.9,889 కోట్లతో ఈ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టినట్టు ప్రకటించారు . ఏపీ లోని మూడు పోర్ట్‌లను కలుపుతూ ఈ రైల్వే లైన్ల నిర్మాణాన్ని చేపట్టినట్టు వెల్లడించారు. గోదావరి నదిపై కొత్తగా నాలుగు కిలోమీటర్ల మేర భారీ వంతెన నిర్మిస్తామని తెలిపారు.

# సెకండ్ ఇంటర్‌కు ఇంప్రూవ్‌మెంట్

## పాస్, ఫెయిల్ విద్యార్థులందరికీ ఛాన్స్

## ప్రాక్టికల్ ఎగ్జామ్స్ నో ఛాన్స్..

## ఇంటర్ బోర్డు కీలక ప్రకటన

(అమరావతి - జయజయహే)

ఇప్పటి వరకు కేవలం ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు మాత్రమే ఇంప్రూవ్‌మెంట్ రాసుకునే అవకాశం ఉండేది. కానీ ఈ సంవత్సరం నుంచి ఇంటర్ సెకండియర్ విద్యార్థులు కూడా ఇంప్రూవ్‌మెంట్ రాసుకోవచ్చు. ఈ మేరకు ప్రభుత్వం ప్రకటన చేసింది. ఈ సంవత్సరం నుంచే దీన్ని అమలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇకపై సెకండియర్ విద్యార్థులు కూడా తమ మార్కుల్ని పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఏపీ ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ సెకండియర్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులందరికీ ప్రథమ సంవత్సరం మాదిరిగానే.. సబ్జెక్టుల వారీగా ఇంప్రూవ్‌మెంట్ రాసుకునేందుకు ప్రభుత్వం అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఇంటర్ ఫలితాలను ప్రకటించిన ఇంటర్‌బోర్డు అధికారులు మే 21వ తేదీ నుంచి జూన్ 4 వరకూ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే సెకండియర్ విద్యార్థులకు ఇంప్రూవ్‌మెంట్ రాసే అవకాశాన్ని కూడా ఈ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నుంచే అమలు చేయనున్నట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. గత నెలలో జరిగిన ఎగ్జామ్స్ రాసిన ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు పాస్ లేదా ఫెయిల్ అయినప్పటికీ.. పాస్ అయిన పేపర్లలో మాత్రం ఇంప్రూవ్‌మెంట్ కోసం హాజరు కావొచ్చన్నారు. ప్రతి పేపర్‌లో ఉత్తమ మార్కులనే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఫెయిల్ అయిన విద్యార్థులు.. ఆయా సబ్జెక్టుల్లో పాస్ అయ్యేంత వరకు పరీక్షలు రాసుకోవచ్చని.. దీనిపై ఎలాంటి పరిమితి లేదన్నారు. అయితే ప్రాక్టికల్ పరీక్షలకు ఇంప్రూవ్‌మెంట్ అవకాశం లేదని స్పష్టం చేశారు. పరీక్ష ఫీజు రూ. 600లతో పాటు ఇంప్రూవ్‌మెంట్ పరీక్షకు ఒక్కో సబ్జెక్టుకు రూ. 160 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఫీజు చెల్లింపునకు ఏప్రిల్ 20 నుంచి 27 వరకు అవకాశం కల్పించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.


# గత పాలకుల చెత్తను తుడిచేస్తున్నాం

### స్వర్ణాంధ్ర దిశగా అడుగులు!

### నిడదవోలు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు గర్జన

### పుష్కరాల లోపే పోలవరం పూర్తి

**రాజమహేంద్రవరం/నిడదవోలు, జయజయహే ప్రతినిధి:**





గత పాలకులు రాష్ట్రాన్ని ఒక చెత్త కుప్పగా మార్చేశారని, గత 15 నెలలుగా ఆ కల్మషాన్ని కడిగేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం నిడదవోలులో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా 'జల హారతి-జలధార' థీమ్‌తో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు.

**వ్యర్థం నుంచి అర్థం.. సర్క్యులర్ ఎకానమీయే లక్ష్యం**

రాష్ట్రంలో పేరుకుపోయిన 150 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తలో ఇప్పటికే 114 లక్షల మెట్రిక్ టన్నులను తొలగించామని సిఎం వెల్లడించారు. "జూన్ నాటికి రాష్ట్రాన్ని సంపూర్ణంగా చెత్త రహితంగా తీర్చిదిద్దుతాం. ఇందుకోసం రూ. 603 కోట్లతో ఆధునిక ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. చెత్తను సమస్యగా చూడకుండా, దాని నుంచి విద్యుత్, సంపద సృష్టించేలా 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్లను పెంచుతున్నాం" అని ఆయన వివరించారు. ఈ ఏడాది చివరికల్లా 7.14 లక్షల కిచెన్ గార్డెన్లు, లక్ష సోక్ పిట్లు నిర్మించి పర్యావరణ పరిరక్షణలో కొత్త రికార్డు సృష్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**పోలవరంపై పట్టు.. అమరావతిపై స్పష్టత**

తెలుగు జాతి జీవనాడి పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, డయాఫ్రాం వాల్‌ను గోదాట్లో కలిపేసి చారిత్రక తప్పిదం చేసిందని చంద్రబాబు మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తాజాగా డయాఫ్రాం వాల్ నిర్మాణాన్ని పూర్తి చేశామని, రాబోయే గోదావరి పుష్కరాల నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. అలాగే, అమరావతే మన శాశ్వత రాజధాని అని పార్లమెంటు చట్టం చేసిందని, రైతుల త్యాగాలను వృధా పోనివ్వమని స్పష్టం చేశారు.

**సూపర్ సిక్స్‌తో సంక్షేమ విప్లవం**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తోందని సిఎం గుర్తుచేశారు.

తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం 2.0 పథకాలతో మహిళా సాధికారతకు బాటలు వేశాం.

అన్న క్యాంటీన్లు: పేదవాడి ఆకలి తీర్చే 269 క్యాంటీన్లను పునరుద్ధరించాం.

ఉద్యోగ కల్పన: రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడమే మా లక్ష్యం.

**'గొడ్డలి పార్టీ'పై ఘాటు విమర్శలు**

వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "వారికి తెలిసింది విధ్వంసం, నరకటం, చంపడమే. చివరకు పోస్టర్లకు కూడా జంతు బలి ఇచ్చే సంస్కృతి వారిది. పేదవాడికి అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను అడ్డుకున్న వారికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదు. మహిళా వ్యతిరేక పార్టీలను ప్రజలు తరిమికొట్టాలి" అని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో పచ్చదనాన్ని ప్రస్తుతమున్న 31.33 శాతం నుండి 2047 నాటికి 50 శాతానికి పెంచాలని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతూ ముఖ్యమంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.




### ప్రకాష్ రాజ్ హిందూ సమాజానికి
# క్షమాపణ చెప్పాలి

### గోకవరం విశ్వహిందూ పరిషత్ డిమాండ్:

**తూర్పుగోదావరి జిల్లా/గోకవరం జయ జయహే ప్రతినిధి**

శ్రీరాముడిపై, అనుచిత వ్యాఖ్యలు చేసి రామాయణానికి వక్రభాష్యాన్ని చెప్పిన సినీ నటుడు ప్రకాష్ రాజ్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని గోకవరం మండల విశ్వహిందూ పరిషత్తు డిమాండ్ చేసింది .శనివారం ఉదయం గోకవరం మెయిన్ రోడ్డు లోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రకాష్ రాజ్ అనే ఉన్మాదికి మంచి బుద్ధి ప్రసాదించాలని ఆంజనేయ స్వామికి పూజలు చేసి అనంతరము మండల బిజెపి అధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, విశ్వహిందూ పరిషత్తు రాజమండ్రి జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆది విష్ణు మాట్లాడుతూ సినీ నటుడు ప్రకాష్ రాజ్ మతిభ్రమించి మాట్లాడుతున్నాడని కోట్లాది ప్రజల ఆరాధ్య దైవమైనటువంటి శ్రీరామచంద్రుని పైన అనుచిత వ్యాఖ్యలు చేసి ఆదికావ్యమైన శ్రీరామాయణా నికి వక్ర భాష్యం చెప్పి కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వ్యక్తి మర్యాదగా భే షరతుగా హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు . ప్రకాష్ రాజ్ ఒక సమావేశంలో మాట్లాడుతూ రామలక్ష్మణులు ఉత్తరాదికి చెందిన వాళ్ళని, రావణుడు దక్షిణాదికి చెందిన గిరిజనుడని రామలక్ష్మణులు రావణుడి తోటలో పండ్లు దొంగతనముగా కోసుకుని తిన్నారని అందుకని సూర్పణక వెళ్లి అపరాధ రుసుము చెల్లించమందని దానికి నిరాకరించడం వలన రామ రావణ యుద్ధం జరిగిందని మాట్లాడాడు ఈ ఉన్మాదికి రామాయణాన్ని గురించి మాట్లాడే అర్హత ఉందా అని, శ్రీరామునిఆదర్శ పాలన యుగయుగాలకు చిరస్థాయిగా నిలిచిన, రామాయణాన్ని వక్రీకరించి కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసినటువంటి సినీ నటుడు ప్రకాష్ రాజ్ కు ఈ దేశంలో జీవించే హక్కు లేదని ఇటువంటి వాడిని దేశ బహిష్కరణ చేయాలని, సమాజంలో వర్గ వైషమ్యాలను సృష్టించే ఇటువంటి చీడపురుగుల పైన న్యాయస్థానాలు కూడా సుమోటోగా కేసులు వేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.




# పూర్ణా మార్కెట్‌లో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర

**విశాఖపట్నం (జయ జయహే)**

స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విశాఖను స్వచ్ఛత నగరంగా రూపొందించేందుకు ప్రజలు తోడ్పాటు అందించాలని.. విశాఖ దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, ఏపీ ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ పిలుపునిచ్చారు.శనివారం పూర్ణా మార్కెట్ వినాయకుడి గుడి వద్ద నిర్వహించినస్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అందరిచే ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సీతంరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని శుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ, దేశంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అమలుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే ప్రతినెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలు పారిశుధ్యంలో భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బుచ్చ రామిరెడ్డితో పాటు వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



### అన్నా క్యాంటీన్ను ప్రారంభించిన
# హోం మంత్రి అనిత

### ప్రజలతో కలిసి భోజనం చేసిన మంత్రి

**పాయకరావుపేట, ఏప్రిల్ 18:(-జయ జయహే)**

పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట పట్టణంలో రూ.61 లక్షల వ్యయంతో నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను మంత్రి అనిత ప్రారంభించారు. అనంతరం క్యాంటీన్‌లో భోజనాలను స్వయంగా వడ్డించి, స్థానిక ప్రజలతో కలిసి భోజనం చేశారు. భోజనాల నాణ్యతపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, పేదవారికి మంచి భోజనం అందించడం అన్నా క్యాంటీన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను రద్దు చేసి పేదలకు భోజనం దూరం చేసిందన్నారు. 2019--2024 మధ్య కాలంలో వాటిని రాజన్న క్యాంటీన్లుగా అయినా కొనసాగించాలని కోరినా స్పందన లేకపోయిందని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, పట్టణాలతో పాటు గ్రామీణ మండలాల్లో కూడా వీటిని విస్తరిస్తున్నామని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి అడ్డరోడ్డు సమీపంలో మరో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాయకరావుపేటలోని సరయ్య చెరువు వద్ద స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. 'జలం--జీవం' నినాదంతో చెత్త తొలగింపు కార్యక్రమంలో స్వయంగా పాల్గొని, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. సరయ్య చెరువును అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన ఆమె, చెరువును శుభ్రపరచి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.






## జియో వద్దు.. ఎయిర్టెల్ ముద్దు..!

**గోకవరం జయ జయహే ప్రతినిధి**

గోకవరం మండలంలో జియో సెల్ నెట్‌వర్క్‌పై వినియోగదారుల అసంతృప్తి రోజు రోజుకు పెరుగుతోంది. అత్యవసర సమయంలో కూడా కాల్స్ కలవకపోవడం, ఇంటర్నెట్ పూర్తిగా పనిచేయకపోవడం వల్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా "జియో వద్దు... ఎయిర్టెల్ ముద్దు" అంటూ వినియోగదారులు జియో నెట్‌వర్క్‌ను వదిలి ఇతర నెట్‌వర్క్‌లకు మారుతున్న పరిస్థితి ఏర్పడింది.వినియోగదారుల మాటల్లో చెప్పాలంటే, ముఖ్యమైన కాల్స్ చేయాల్సిన సమయంలో నెట్‌వర్క్ లేకపోవడం వల్ల అత్యవసర పనులు కూడా నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు జియో కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం పరిస్థితిని మరింత ఆగ్రహానికి దారి తీస్తోంది. "సిగ్నల్ లేదు... కాల్ లేదు... డేటా లేదు... అయితే ఈ నెట్‌వర్క్ ఎందుకు?" అంటూ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేకంగా గోకవరం మండలంలోని పలు గ్రామాల్లో జియో సేవలు పూర్తిగా దెబ్బతిన్నాయని స్థానికులు చెబుతున్నారు. నెట్‌వర్క్ సమస్యల కారణంగా ఆన్‌లైన్ పనులు, డిజిటల్ చెల్లింపులు, విద్యార్థుల చదువులు కూడా ప్రభావితమవుతున్నాయని అంటున్నారు. దీంతో వినియోగదారులు ప్రత్యామ్నాయంగా ఎయిర్టెల్ నెట్‌వర్క్‌కు మారిపోతూ జియోకు గట్టి హెచ్చరిక పంపుతున్నట్టుగా కనిపిస్తోంది. ఇప్పటికైనా జియో అధికారులు స్పందించి నెట్‌వర్క్ సమస్యలను పరిష్కరించకపోతే వినియోగదారుల సంఖ్య భారీగా తగ్గే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. "సేవలు సరిగా లేకపోతే వినియోగదారులు ఎందుకు ఉండాలి?" అంటూ మండిపడుతున్నారు.

# బైకు ప్రమాదంలో యువకుడు మృతి

**కొయ్యూరు (జయ జయహే) న్యూస్ ఏప్రిల్ 19**



అల్లూరి జిల్లా కొయ్యూరు కు చెందిన దొండ పందిరి విష్ణు చింతపల్లి ముత్యాలమ్మ తీర్థానికి వెళ్లి, స్నేహితునితో కలిసి తిరిగి వస్తుండగా రింతాడ సమీపంలో బైకు అదుపుతప్పి ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.చికిత్స నిమిత్తం హుటాహుటిన చింతపల్లి ఆసుపత్రి కి తీసుకెళ్లగా శనివారం ఉదయం మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు.అతిపిన్న వయసులోనే కుమారుని మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. భార్య, రెండేళ్ల బాలుడు అనాథలుగా మిగిలారు. మృదుస్వభావి అయిన విష్ణు మృతితో కొయ్యూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘాట్ రోడ్లలో వాహనాలు నడిపేటప్పుడు అందరూ అప్రమత్తంగా ఉండాలి అని పలువురు తెలిపారు..



# కొండ ఢీకొట్టిన వ్యాన్

### ఇద్దరి పరిస్థితి విషమం

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఏప్రిల్ 19**

అల్లూరి జిల్లా, కొయ్యూరు పరిధిలో, బొంతువలస ఘాట్ రోడ్డ లో శనివారం ఉదయం చింతపల్లి జాతర నుంచి కొయ్యూరు వైపు వెళుతుండగా ఐచర్ వ్యాన్ అదుపుతప్పి బొంతువలస ఘాట్ రోడ్లో కొండ అంచును ఢీకొట్టింది.ఆ సమయంలో వ్యాన్‌లో సుమారు 40 మంది వరకు ప్రయాణికులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.గాయపడిన వారంతా పొట్టకూటి కోసం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన వారు. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు అయ్యాయి. గాయాలయిన వారిని రాజేంద్రపాలెం ఆసుపత్రికి తరలించడంతో వైద్యాధికారి జగదీష్ చికిత్స అందించారు.



# అంతర్ముఖ ప్రయాణంతో ఆత్మానుభూతి

(సి.హెచ్.ప్రతాప్)

అంతర్ముఖ ప్రయాణం అనేది మనిషి తనను తాను తెలుసుకోవడానికి, తన ఉనికిలోని లోతులను దర్శించడానికి చేసే ఒక పవిత్రమైన యాత్ర. బాహ్య ప్రపంచంలో మనం వెతుకుతున్న ఆనందం, శాంతి మరియు తృప్తి వాస్తవానికి మన లోపలే నిక్షిప్తమై ఉన్నాయి. ఆధునిక కాలంలో మనిషి నిరంతరం బయటి వస్తువులు, వ్యక్తులు మరియు సాంకేతికతతో ముడిపడి ఉన్నాడు. దీనివల్ల తన అంతరాత్మతో సంబంధం తెగిపోతోంది. ఈ అంతరాన్ని పూరించడానికి అంతర్ముఖ ప్రయాణం ఎంతో అవసరం. మనస్సును బాహ్య విషయాల నుండి మళ్లించి, లోపలి వైపు ప్రసరింపజేయడమే ఈ ప్రక్రియలోని ప్రధాన ఉద్దేశ్యం.

ఇంద్రియాల ద్వారా మనం ప్రపంచాన్ని చూస్తాం, కానీ ఆత్మ ద్వారా మాత్రమే మనం సత్యాన్ని గ్రహించగలం. ధ్యానం అనేది ఈ ప్రయాణానికి ఒక శక్తివంతమైన సాధనం. ప్రతిరోజూ కొంత సమయం మౌనంగా ఉండి, మన ఆలోచనలను గమనించడం వల్ల మనస్సులోని అల్లకల్లోలం తగ్గుతుంది. మౌనంలోనే అత్యున్నతమైన శబ్దాలు వినబడతాయి. ఆ నిశ్శబ్దంలోనే మన అసలైన స్వరూపం వెల్లడవుతుంది. మనలోని అహంకారం, ఈర్ష్య, ద్వేషం వంటి మాలిన్యాలను తొలగించుకున్నప్పుడు అంతరాత్మ ప్రకాశిస్తుంది. ఈ ప్రయాణం కేవలం ఐహిక సుఖాల కోసం కాదు, అది మనశ్శాంతి కోసం మరియు ఆధ్యాత్మిక ఉన్నతి కోసం ఉద్దేశించినది.

అంతర్ముఖ ప్రయాణంలో మొదటి మెట్టు ఏకాంతం. ఏకాంతం అంటే ఒంటరితనం కాదు, అది మనతో మనం గడపడం. మన తప్పులను మనం సమీక్షించుకోవడం, మనలోని బలాలను గుర్తించడం ఈ దశలోనే జరుగుతాయి. నిరంతరం ఇతరుల గురించి ఆలోచించడం కంటే, మన గురించి మనం తెలుసుకోవడం గొప్ప జ్ఞానం. ఈ ప్రపంచం ఒక అద్దం వంటిది; మన లోపల ఏముందో బయట అదే కనిపిస్తుంది. మన లోపల ప్రశాంతత ఉంటే, బయట కూడా ప్రశాంతత గోచరిస్తుంది. ఆధ్యాత్మిక గ్రంథాల పఠనం, సత్సంగం మరియు నిరంతర ఆత్మవిచారణ ఈ మార్గంలో మనకు తోడ్పడతాయి. మనలో నిక్షిప్తమై ఉన్న దైవత్వాన్ని గుర్తించడమే ఈ ప్రయాణం యొక్క గమ్యం.

మానవ జీవితం కేవలం ఆహారం, నిద్ర, భయం వంటి ప్రాథమిక అవసరాలకే పరిమితం కాకూడదు. అంతర్ముఖుడైన వ్యక్తి తనలోని నిశ్చలత్వాన్ని పొందుతాడు. ఈ నిశ్చలత్వమే అతడికి కష్ట సమయాల్లో ధైర్యాన్ని, సంతోష సమయాల్లో వినయాన్ని ప్రసాదిస్తుంది. ప్రతి జీవిలోనూ ఉన్న పరమాత్మను దర్శించగలిగే స్థితి అంతర్ముఖ ప్రయాణం ద్వారానే లభిస్తుంది. 'నేను ఎవరు?' అనే ప్రశ్నకు సమాధానం వెతకడమే అసలైన ఆధ్యాత్మికత. ఇది ఒక రోజులో ముగిసేది కాదు, నిరంతర సాధనతో సాధ్యమయ్యే ప్రక్రియ. ఈ ప్రయాణంలో గెలిచిన వాడు ప్రపంచాన్ని జయించిన వాడు అవుతాడు.

చివరికి, అంతర్ముఖ ప్రయాణం అనేది మనిషిని అశాంతి నుండి శాంతి వైపు, చీకటి నుండి వెలుగు వైపు నడిపిస్తుంది. మనసులోని కోరికలను నియంత్రించి, ఆత్మారాముడిగా ఉండటమే పరమార్థం. ఈ ప్రయాణం ప్రారంభించిన వ్యక్తికి బాహ్య ప్రపంచంలోని ఆకర్షణలు తాత్కాలికమని అర్థమవుతాయి. లోపల వెలిగే ఆత్మజ్యోతిని దర్శించినప్పుడు, జీవితం ధన్యమవుతుంది. మనలోని శాశ్వతమైన సత్యాన్ని గుర్తించి, సత్యమార్గంలో పయనించడమే మానవ జన్మకు సార్థకత. ఈ అంతర్ముఖ యాత్ర ద్వారానే మనిషి పరమానందాన్ని పొందుతాడు.

# వాల్మీకి.. పరివర్తన మరియు పునరుద్ధరణకు ప్రతీక

**భారత సంస్కృతిలో మహర్షి వాల్మీకి పేరు ఆదికవిగా చిరస్మరణీయమైనది. ఆయన రచించిన రామాయణం కేవలం ఒక ఇతిహాసం మాత్రమే కాదు, అది "మానవ జీవితంలోని నైతికత, మార్పు, మరియు విమోచన యొక్క ప్రస్థానం."**

**వాల్మీకి మహర్షిగా పూజింపబడే ముందు వాల్మీకి ఒక సాధారణ మానవుడు --- అంతకంటే ఎక్కువగా, ఒక దొంగ. కానీ ఆయన జీవితంలో జరిగిన ఆత్మజ్ఞాన మార్పు అతనిని ఒక కవిగా, ఒక మునిగా, ఒక సత్యప్రచారకుడిగా మార్చింది. ఆయన జీవితం మనకు తెలిపే నీతి ఏమిటంటే: ప్రతీ మనిషిలో మార్పు, పశ్చాత్తాపం, మరియు ఆధ్యాత్మిక పునరుద్ధరణకు సామర్థ్యం ఉంటుందని .**




### దొంగ నుండి ఋషిగా -- పరివర్తన యొక్క యాత్ర


వాల్మీకి మొదట "రత్నాకరుడు" అనే పేరుతో అడవిలో దోపిడీలు చేసేవాడు. జీవనం కోసం, కుటుంబం కోసం దోపిడీ అతనికి సహజమైన మార్గమైపోయింది. కానీ ఒక రోజు ఆయన ఒక మహర్షిని (నారదుని) దోచుకోవాలని ప్రయత్నించాడు. అప్పుడు నారదుడు ప్రశాంతంగా, "నీ పాపఫలాన్ని నీ కుటుంబం పంచుకుంటుందా?" అని అడిగాడు. రత్నాకరుడు తన కుటుంబాన్ని అడగగా, "నువ్వు చేసే పాపం నీదే; మేము నీతో దానిని పంచుకోలేము." అని అంటారు.

ఆ వాక్యం రత్నాకరుడి మనసును కుదిపేసింది. అదే అతని 'ఆత్మజాగృతి క్షణం.' ఆయన తన పాపజీవితాన్ని వదిలి ధ్యానం ప్రారంభించాడు. సంవత్సరాలతరబడి కఠోర తపస్సు చేసి, చివరికి " వాల్మీకి " అనే ఋషిగా పునర్జన్మ పొందాడు. వాల్మికిలో వచ్చిన ఈ మార్పు మనకు తెలియజేసేది ఏమిటంటే: " ఎంత తప్పు చేసినా, నిజమైన పశ్చాత్తాపం మరియు ధ్యానం మనిషిని దైవ స్థాయికి తీసుకెళ్తాయి " అని.

### సృజనాత్మకత ద్వారా విమోచనం

తర్వాత వాల్మీకి మహర్షి శ్రీరాముని జీవగాథను శ్రద్ధతో విన్నాడు. ఆ కథలో ప్రతిధ్వనించిన సత్యం, నీతి, ధర్మం ఆయన హృదయాన్ని లోతుగా స్పృశించాయి. ఆ విలువల పట్ల కలిగిన ఆత్మీయ ప్రేమ, ఆయనను ఆదికవిగా నిలబెట్టింది.

ఒకసారి తపస్సులో నిమగ్నుడై ఉన్నప్పుడు, ఆయన ఒక పక్షుల జంటను చూశాడు --- ప్రేమతో విహరిస్తున్న ఆ జంటలోని మృగశిఖర పక్షిని వేటగాడు అకస్మాత్తుగా చంపాడు. ఆ దృశ్యం వాల్మీకి హృదయాన్ని కదిలించింది. ఆ వేదనలోంచి ఆయన నోటికి సహజంగా పొంగిన మాటలు ఛందస్సుతో కూడిన శ్లోకంగా మారాయి. అదే మానవ



సాహిత్య చరిత్రలో తొలి కవితా రేఖ --- ప్రపంచానికి కావ్యయుగానికి ఆరంభమైన క్షణం.

" మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమ శాశ్వతీ సమాః "ఈ శ్లోకం కేవలం ఒక శాపం కాదు; అది మనిషి హృదయంలో ఉన్న "దయ, బాధ, మరియు సృజనాత్మకత యొక్క ప్రతిధ్వని." వాల్మీకి జీవితం మనకు చెప్పే నీతి: కళ, కవిత్వం, సంగీతం లాంటివి కేవలం వినోదానికి కాదు; అవి మనస్సులోని పాపాన్ని శుద్ధి చేసే మార్గాలు కూడా.

### సమకాలీన ప్రాముఖ్యత

వాల్మీకి కథ ఈరోజు సమాజంలో మరింత ప్రాసంగికంగా ఉంది. నేటి ప్రపంచంలో తప్పులు చేసే మనుషులు, తమ గతం వల్ల జీవితాన్నే వదిలేస్తారు. కానీ వాల్మీకి కథ ద్వారా మనం తెలుకోదగినది ఏమిటంటే: " తప్పు జీవితం కాదు; దానిని సరిదిద్దని మనసే తప్పు ."

ఆయన పరివర్తన మనకు నేర్పుతుంది:

ప్రతీ మనిషిలో మార్పు సాధ్యమే -- మనిషి పాపం చేసినా, పశ్చాత్తాపం ద్వారా పునీతుడవవచ్చు.


సృజనాత్మకత విముక్తి మార్గం -- కళ, ఆలోచన, మరియు రచన మన ఆత్మను శుద్ధి చేస్తాయి.

ఆత్మపరిశీలన యొక్క శక్తి -- మన లోపల చూసే ధైర్యం ఉన్నవాడు మాత్రమే నిజమైన జ్ఞాని.

ఆధునిక మానసికశాస్త్రం చెబుతుంది --- ఆత్మపరిశీలన, ఆత్మజ్ఞానం, మరియు మానసిక సజాగ్రత్త మనిషి వ్యక్తిత్వ వికాసానికి అత్యంత కీలకమైన అంశాలు అని. ఈ సూత్రాల సారాన్ని మనం వాల్మీకి మహర్షి జీవితంలోనే చూస్తాం. ఆయన కథ మనకు ఈ భావనలకు ప్రాచీన సాక్ష్యంగా నిలుస్తుంది --- మనసును పరిశీలించినవాడే జ్ఞానాన్ని, ఆ జ్ఞానంతో జీవన మార్గాన్ని కనుగొనగలడని.

వాల్మీకి ఒక దొంగగా మొదలై, ఋషిగా నిలిచాడు. ఆయన జీవితయాత్ర మానవ పరివర్తన యొక్క పరాకాష్ఠ. ఆయన యఈవితం వలన మనకు తెలిసే విషయం ఏమిటంటే: " గతం నిన్ను నిర్వచించదు; నీ చైతన్యం, నీ పశ్చాత్తాపం, నీ సృజనాత్మకతే నీ నిజమైన స్వరూపం ."

వాల్మీకి కథ కేవలం ఒక ఆధ్యాత్మిక పాఠం కాదు, అది మనిషి అంతరంగ పరివర్తనకు ప్రేరణ. ఆయన జీవిత సత్యం ఈ ఒక్క వాక్యంలో చెప్పవచ్చు: " తప్పు చేయడం మానవం; పశ్చాత్తాపం చేయడం దైవం ."



ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు చెనమల్లు

# సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం.. చందనోత్సవ వైభవం

(సి.హెచ్.ప్రతాప్)

**సింహాచల క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిజరూప దర్శనం భక్తుల పాలిట ఒక అద్భుతమైన మరియు అరుదైన ఆధ్యాత్మిక అనుభూతి. ప్రతి ఏటా వైశాఖ శుద్ధ తదియ నాడు జరిగే 'చందనోత్సవం' లేదా 'చందనయాత్ర' సందర్భంగా మాత్రమే స్వామివారిని గంధపు పూత లేకుండా దర్శించుకునే భాగ్యం కలుగుతుంది. ఏడాది పొడవునా గంధపు లేపనంతో ఒక పెద్ద లింగాకృతిలో కనిపించే స్వామివారు, ఈ ఒక్క రోజు మాత్రమే తన అసలైన రూపంలో భక్తులకు సాక్షాత్కరిస్తారు. ఈ అపురూప దృశ్యాన్ని కళ్లారా చూడటానికి దేశవిదేశాల నుండి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ క్షేత్రం విశాఖపట్నంలోని ఎత్తైన సింహగిరి పైన ఉండి, ప్రకృతి ఒడిలో పరవశింపజేస్తుంది. పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణం భక్తులకు మానసిక శాంతిని కలిగిస్తాయి.**



హిరణ్యకశ్యపుని సంహరించిన తర్వాత నరసింహ స్వామి అత్యంత ఉగ్రరూపంతో ఉన్నాడని, ఆయనను శాంతింపజేయడానికి దేవతలు గంధపు లేపనం చేశారని పురాణాలు చెబుతున్నాయి. ఆ సంప్రదాయం ప్రకారం, స్వామివారి శరీర వేడిని తగ్గించడానికి ఏడాది పొడవునా గంధాన్ని పూస్తారు. కేవలం అక్షయ తృతీయ రోజున మాత్రమే ఆ గంధాన్ని తొలగిస్తారు. ఉదయాన్నే సుప్రభాత సేవ అనంతరం, అర్చకులు ప్రత్యేక పరికరాలతో స్వామివారిపై ఉన్న పాత గంధపు పొరలను అత్యంత జాగ్రత్తగా తొలగిస్తారు. గంధం తొలగించిన తర్వాత శంఖుచక్రాలు ధరించి, వరాహ ముఖం, నరసింహ దేహం మరియు తోకతో కూడిన స్వామివారి త్రిభంగి రూపం భక్తులకు గోచరిస్తుంది. ఈ రూపం భక్తులకు అభయాన్ని, ధైర్యాన్ని ప్రసాదిస్తుంది. స్వామివారిని చూసిన వెంటనే భక్తుల కళ్లలో భక్తి పారవశ్యం వెల్లివిరుస్తుంది.

నిజరూప దర్శనం తర్వాత స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి మరియు గంగాజలంతో మహాభిషేకం నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు జరుగుతాయి. నిజరూపాన్ని దర్శించుకోవడం వల్ల కోరిన కోరికలు నేరవేరుతాయని, సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. చందనోత్సవం రోజున సింహాద్రి అప్పన్నను దర్శించుకుంటే కైవల్యం లభిస్తుందని పెద్దలు చెబుతుంటారు. సాయంత్రం వేళ మళ్లీ స్వామివారికి కొత్త గంధపు లేపనాన్ని పూయడం ప్రారంభిస్తారు. సుమారు మూడు మణుగుల బరువున్న గంధాన్ని ఈ పూత కోసం ఉపయోగిస్తారు. ఈ గంధాన్ని భక్తులు ప్రసాదంగా స్వీకరించి తమ నొసట ధరిస్తారు. ఈ చందనం శరీరాన్ని చల్లబరచడమే కాకుండా మనసులోని వికారాలను కూడా తొలగిస్తుందని నమ్ముతారు.

సింహాచలం దేవాలయం కళింగ వాస్తు శైలిలో అద్భుతంగా నిర్మించబడింది. ఇక్కడి ప్రతి శిల్పం ఒక కథను చెబుతుంది. ముఖ్యంగా గాలిగోపురం మరియు ప్రాకారాలు ప్రాచీన కళా వైభవానికి నిదర్శనాలు. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు ఈ క్షేత్రాన్ని దర్శించి అనేక కానుకలు సమర్పించినట్లు చరిత్ర చెబుతోంది. స్వామివారిని 'సింహాద్రి అప్పన్న' అని భక్తులు ఎంతో ప్రేమగా పిలుచుకుంటారు. ఈ క్షేత్రంలో గంగధార వంటి జలధారలు ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటాయి, ఇది స్వామివారి చల్లదనాన్ని సూచిస్తుంది. నిజరూప దర్శనం రోజున ఇచ్చే చందన ప్రసాదం ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ గంధాన్ని నూరడం కోసం నెల రోజుల ముందే సన్నాహాలు మొదలవుతాయి. వేలాది మంది భక్తులు స్వచ్ఛందంగా గంధం చెక్కలను అరగదీసి స్వామి సేవలో తరిస్తారు.

ఈ ఉత్సవం నిర్వహణలో స్థానిక యంత్రాంగం మరియు దేవస్థాన అధికారులు ఎంతో శ్రద్ధ వహిస్తారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లు, తాగునీరు మరియు ప్రసాదాల పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేస్తారు. కొండపైకి వచ్చే దారి పొడవునా భక్తుల గోవింద నామస్మరణలతో సింహాచలం మారుమోగిపోతుంది. సామాన్య భక్తుల నుండి ప్రముఖుల వరకు అందరూ ఆ అప్పన్న నిజరూప దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షిస్తారు. స్వామివారి గంభీరమైన మరియు కరుణాభరితమైన రూపం మనసులో చిరస్థాయిగా నిలిచిపోతుంది. భక్తులు సమర్పించే కానుకలు మరియు మొక్కులు స్వామివారిపై వారికి ఉన్న అచంచలమైన భక్తికి నిదర్శనం. ప్రతి ఏటా ఈ ఉత్సవానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది.

చందనోత్సవం కేవలం ఒక ధార్మిక ఉత్సవం మాత్రమే కాదు, అది భక్తికి మరియు సంస్కృతికి ప్రతీక. వేసవి తాపం నుండి స్వామివారిని రక్షించే ఈ ఆచారం వెనుక ఒక గొప్ప శాస్త్రీయ మరియు ఆధ్యాత్మిక సందేశం దాగి ఉంది. ప్రకృతిలోని చల్లదనాన్ని దైవత్వానికి ఆపాదించి పూజించడం మన సంప్రదాయంలోని గొప్పతనం. సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం అనేది ప్రతి భక్తుడి జీవితంలో ఒక మర్చిపోలేని మధుర ఘట్టం. ఈ పవిత్ర రోజున స్వామివారిని స్మరించడం వల్ల మనస్సు నిర్మలమై, ఆధ్యాత్మిక శక్తి కలుగుతుంది. సాయంత్రం సహస్ర ఘటాభిషేకం మరియు తిరిగి గంధలేపనంతో ఈ మహోత్సవం ముగుస్తుంది. అప్పటి నుండి మళ్లీ వచ్చే ఏడాది వరకు స్వామివారు గంధపు కవచంలోనే దర్శనమిస్తారు. ఈ ప్రక్రియ భగవంతుని శాంతి స్థితికి మరియు లోక కల్యాణానికి ప్రతీకగా నిలుస్తుంది. భక్తులు తమ బాధలను మరిచిపోయి స్వామి ధ్యానంలో మునిగిపోతారు.



# మహిళా బిల్లు అడ్డుకోవడం ప్రజాస్వామ్య చరిత్రలో 'చీకటి రోజు

## ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల భారీ నిరసన ర్యాలీ

## పాల్గొన్న సీఎం చంద్రబాబు,

**రాజమహేంద్రవరం/నిడదవోలు, జయజయహే ప్రతినిధి:**

పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు (టీడీపీ, బీజేపీ, జనసేన) భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని, మహిళా హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న రోజును ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి రోజుగా అభివర్ణించారు. మూడు దశాబ్దాలుగా మహిళలు కంటున్న రాజకీయ ప్రాతినిధ్య కలను ప్రతిపక్షాలు స్వార్థ రాజకీయాల కోసం చిదిమేయడం దురదృష్టకరమని ఆయన మండిపడ్డారు. మహిళా లోకానికి తీరని అన్యాయం చేసిన ప్రతిపక్ష పార్టీలు తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.




### ఓటు బ్యాంకు రాజకీయాలు వద్దు

మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే పార్టీల వైఖరి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ముఖ్యమంత్రి విమర్శించారు. మహిళా సాధికారత కోసం ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో వారికి సముచిత న్యాయం జరిగేలా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### తరలివచ్చిన శ్రేణులు

ఈ నిరసన ర్యాలీలో బీజేపీ నాయకులు పీవీఎన్ మాధవ్, సోము వీర్రాజు, జనసేన నాయకులు కందుల దుర్గేష్, మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు. మహిళల అభివృద్ధికి అడ్డుపడుతున్న శక్తులను ప్రజలు రాజకీయంగా తిరస్కరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు పరిసర ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో మహిళలు, ఎన్డీఏ కార్యకర్తలు పాల్గొని ప్రతిపక్షాల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# యువతకు రాజకీయాల్లో స్థిరమైన ఎదుగుదల సాధ్యమే..!







### - నిరూపించిన టీడీపీ రాజ్యసభ సభ్యులు, జాతీయ ఉపాధ్యక్షులు సానా సతీష్ బాబు

### - ఆయన ఎదుగుదల.. యువతకు అదర్శం

### - కార్యకర్త నుంచి జాతీయ ఉపాధ్యక్షుడి వరకు

### - సానా సతీష్ బాబు రాజకీయ ప్రస్థానం

**ఢిల్లీ (జయ జయహే ప్రత్యేక కథనం)**

భారతీయ రాజకీయాల్లో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి జాతీయ స్థాయి నాయకత్వానికి ఎదగడం చాలా అరుదైన విషయం. అయితే, అలాంటి అవకాశాలను సృష్టించే రాజకీయ వేదికగా తెలుగుదేశం పార్టీ నిలిచిందనే విషయాన్ని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు రాజకీయ ప్రస్థానం స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఒక సాధారణ కార్యకర్తగా ప్రారంభమైన ఆయన ప్రయాణం, క్రమంగా పార్టీకి కీలక వ్యూహకర్తగా, చివరకు జాతీయ ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగిన విధానం, పార్టీ అంతర్గత వ్యవస్థలో ఉన్న సామర్థ్యాన్ని, క్రమశిక్షణను తెలియజేస్తోంది.

**ప్రారంభం నుంచి ప్రగతి దిశగా :**

2011లో పార్టీ క్రియాశీల కార్యకర్తగా రాజకీయ రంగంలో అడుగుపెట్టిన సతీష్ బాబు, మొదటి నుంచే చురుకుదనం, కట్టుబాటు, అంకితభావంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. స్థానిక స్థాయిలో పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా నాయకత్వ దృష్టిని ఆకర్షించారు. పార్టీ సిద్ధాంతాల పట్ల విశ్వాసం, సంస్థాగత కట్టుబాటు, ప్రజలతో మమేకమయ్యే తీరు ఆయన ఎదుగుదలకు బలమైన పునాది అయ్యాయి.

ఈ దశలోనే ఆయనలోని నిర్వహణా నైపుణ్యం, సమన్వయ సామర్థ్యం పార్టీ పెద్దల దృష్టికి వచ్చాయి. దాంతో క్రమంగా ఆయనకు పార్టీ లోపలి కీలక బాధ్యతలు అప్పగించబడుతూ వచ్చాయి. ఒక కార్యకర్త నుంచి బాధ్యతాయుత నాయకుడిగా మారే ప్రక్రియలో ఆయన చూపిన స్థిరత్వం, కృషి రాజకీయాల్లో ఎదగాలనుకునే యువతకు ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది.



**ఎన్నికల వ్యూహకర్తగా ప్రతిభ**

2024 సాధారణ ఎన్నికలు సతీష్ బాబు రాజకీయ జీవితంలో కీలక మలుపు. ఉమ్మడి గోదావరి జిల్లాలకు ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా నియమితులైన ఆయన, ఆ బాధ్యతను కేవలం పరిపాలనా కోణంలో కాకుండా వ్యూహాత్మకంగా నిర్వహించారు. స్థానిక సామాజిక సమీకరణలు, అభ్యర్థుల ఎంపిక, ప్రచార ప్రణాళికలు, మైక్రో మేనేజ్‌మెంట్ వంటి అంశాల్లో సమర్థవంతమైన సమన్వయం చూపించారు.

ఆయన సమన్వయంతో ఆ ప్రాంతంలో 21మంది ఎమ్మెల్యేలు, 3 మంది ఎంపీలు విజయం సాధించడం విశేషం. ఈ ఫలితాలు కేవలం ఎన్నికల విజయాలుగా కాకుండా, ఆయన వ్యూహాత్మక సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచాయి. ఎన్నికల రాజకీయాల్లో గ్రౌండ్ లెవల్ డైనమిక్స్‌ను అర్థం చేసుకుని వాటిని ఫలితాలుగా మార్చగల నాయకుడిగా ఆయన ప్రతిష్ఠ పెరిగింది.

**ఉద్యమాల్లో చురుకుదనం -- యువగళం ప్రభావం :**

పార్టీ కార్యకలాపాల్లో మాత్రమే కాకుండా ఉద్యమాల్లో కూడా సతీష్ బాబు చురుకైన పాత్ర పోషించారు. నారా లోకేష్ చేపట్టిన “యువగళం” పాదయాత్రలో ఆయన



పాల్గొనడం, యువతను పార్టీ వైపు ఆకర్షించడంలో కీలకంగా మారింది. ఈ యాత్రలో ఆయన చేసిన గ్రౌండ్ కనెక్ట్ కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై స్పందన, యువతతో నేరుగా మమేకమయ్యే విధానం పార్టీకి కొత్త శక్తిని అందించాయి.

అలాగే, నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అనంతరం జరిగిన ఉద్యమాల్లో కూడా సతీష్ బాబు ముందుండి పోరాటం చేశారు. పార్టీకి అనుకూల పరిస్థితులు లేకపోయినా, కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపడం, సమన్వయం చేయడం, ఉద్యమాలను ముందుకు నడిపించడం వంటి అంశాల్లో ఆయన నాయకత్వ లక్షణాలు స్పష్టంగా కనిపించాయి.

**రాజ్యసభ నుంచి జాతీయ ఉపాధ్యక్షుడి వరకు :**

పార్టీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం, 2024 డిసెంబర్‌లో ఆయనను రాజ్యసభ సభ్యుడిగా నియమించడం ద్వారా విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. ఇది కేవలం వ్యక్తిగత పురోగతి మాత్రమే కాదు, పార్టీకి ఆయన అందించిన సేవలకు ప్రతిఫలం కూడా.

ఇక 2026 ఏప్రిల్‌లో పార్టీ సంస్థాగత మార్పుల నేపథ్యంలో కీలక నిర్ణయాలు తీసుకుంటూ, సీఎం చంద్రబాబు పార్టీని జాతీయ స్థాయిలో విస్తరించాలనే లక్ష్యంతో కొత్త బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నారా లోకేష్‌ను జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించగా, సానా సతీష్ బాబును జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించడం పార్టీ భవిష్యత్ వ్యూహాలకు కీలకంగా మారింది.

ఈ నియామకం ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణంలో యువ నాయకత్వానికి ప్రాధాన్యం పెరిగిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సతీష్ బాబు వంటి నాయకులు జాతీయ స్థాయిలో పార్టీ విస్తరణకు కొత్త దిశను అందిస్తారని భావిస్తున్నారు.

**సమన్వయం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు :**

జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, సతీష్ బాబు తన దృష్టిని కేంద్ర--రాష్ట్ర సమన్వయంపై కేంద్రీకరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టడం, పెట్టుబడులను ఆకర్షించడం, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు అందించడం వంటి అంశాల్లో ఆయన చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

ప్రత్యేకంగా ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో ఆయన చూపుతున్న చొరవ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రంతో సమన్వయం పెంచడం ద్వారా రాష్ట్రానికి మరిన్ని అవకాశాలను తీసుకురావాలనే దిశగా ఆయన కృషి కొనసాగుతోంది.

**నాయకత్వంపై విశ్వాసం -- భవిష్యత్ దిశ**

ఈ సందర్భంగా సతీష్ బాబు, తనపై నమ్మకం ఉంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలతో కలిసి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే, నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

**ముగింపు: కార్యకర్తకు అవకాశమిస్తే నాయకత్వం ఎలా రూపుదిద్దుకుంటుందో...**

సానా సతీష్ బాబు రాజకీయ ప్రస్థానం ఒక వ్యక్తిగత విజయగాథ మాత్రమే కాదు; అది ఒక సంస్థాగత మోడల్‌కు ప్రతిరూపం. క్రమశిక్షణ, కృషి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ఉంటే, ఒక కార్యకర్త కూడా జాతీయ స్థాయి నాయకుడిగా ఎదగవచ్చని ఆయన ప్రయాణం చెబుతోంది.

ఈ ప్రస్థానం, ముఖ్యంగా యువతకు రాజకీయాల్లో స్థిరమైన ఎదుగుదల సాధ్యమనే సందేశాన్ని ఇస్తోంది. పార్టీకి కట్టుబాటు, ప్రజలతో అనుసంధానం, సమర్థవంతమైన నిర్వహణ ఉంటే, రాజకీయాల్లో ఉన్నత స్థానాలు అందుబాటులో ఉంటాయని సతీష్ బాబు ఉదాహరణగా నిలుస్తున్నారు.

# ప్రకృతి కార్యాలు ద్వారా విజ్ఞానం అవసరం





### విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచుదాం

### పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచుదాం

### ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాలి: జె.వి. రత్నం

**విశాఖపట్నం (జయ జయహే)**

ప్రకృతి కార్యాశాల ద్వారా విజ్ఞానం పెంచుకోవడం అవసరం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. శనివారం ఉదయం మల్కాపురం లోని సెయింట్ ఆన్స్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ సిస్టర్ ఏనిమేటర్ గెసిల్ల అధ్యక్షతన 400 మంది ఎన్ సిసి విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో విత్తనాల బంతులు, ధాన్యం కంకులు కుచ్చులు తయారు చేసి, పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచి, మొక్కలు నాటిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనం అడవుల్లో, కొండలలో పర్యటించి అక్కడి వాతావరణం, జీవవైవిధ్యాన్ని పరిశీలించి పరిరక్షించాలని కోరారు. విత్తనాల బంతులతో సామాజిక వనాలు పెంచుదాం అన్నారు. మనం పీల్చే గాలిలో రెండు శ్వాసల్లో ఆక్సిజన్ లేకుంటె మృత్యువాత పెడతామని వివరించారు. పశుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచుదాం అన్నారు. ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాలి అని కోరారు. వనమాలి, సిటిజి ప్రతినిధి మళ్ళ సరిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మిద్దె తోటలు పెంచాలని కోరారు. తద్వారా ఆరోగ్య కరమైన కూరగాయలు ఆకుకూరలు పండ్లు పండించడం అవసరం అని వివరించారు. మిద్దె తోటలు ఉన్న ఇంటి వద్ద రెండు డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గుతుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏనిమేటర్ సిస్టర్ ఎల్సి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సిస్టర్ ప్రేమ కుమారి ఇంటర్ కాలేజీ ప్రిన్సిపల్ సిస్టర్ కేసలిన్ జూలియట్, హిందీ అధ్యాపకురాలు ఏ.ఆదిలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు పి. శివరంజని, వనమాలి సిటిజి ప్రాంతీయ ప్రతినిధులు కవిత, భారతి, దేవిక, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ సమన్వయకర్త లు రాజేశ్వరి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



## ఎండాడలో హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహాలు

### నిర్మాణాలకు భూమి పూజ చేసిన సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

### భాగస్వామ్యమైన హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హారి, జస్టిస్ రవి చీమలపాటి

**విశాఖపట్టణం, ఏప్రిల్ 18, జయ జయహే**

విశాఖపట్టణంలోని ఎండాడ పరిధిలో ఐదెకరాల స్థలంలో నిర్మించతలపెట్టిన హైకోర్టు న్యాయమూర్తుల అతిథి గృహ నిర్మాణాలకు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ శనివారం శంకుస్థాపన చేశారు. వేద మంత్రోచ్చరణలు, శాస్త్రోక్త పూజల నడుమ సహచర న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హారి, జస్టిస్ రవి చీమలపాటిలతో కలిసి భూమి పూజ నిర్వహించారు. అనంతరం మీట నొక్కి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సహచర న్యాయమూర్తులతో పాటు గునపం పట్టుకొని, సిమెంట్ వేసి నిర్మాణాలకు అంకురార్పణ చేశారు. ఇతర పూజా క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భూమిపూజ చేసిన ప్రాంతం నుంచి సాగర తీరాన్ని వీక్షించారు. కొండపై భాగం నుంచి కనిపించే పరిసరాలను పరిశీలించారు. నిర్మాణ ప్రక్రియలు, ఇతర అంశాలకు సంబంధించిన ప్రాథమిక వివరాలను కోర్టు, జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు, ఫస్ట్ ఏడీజే వెంకటరమణ, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, ఇతర న్యాయమూర్తులు, కోర్టు అధికారులు, వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

**న్యాయమూర్తులకు ఆత్మీయ సత్కారం**

శంకుస్థాపన క్రతువు అనంతరం కొండ దిగువ భాగంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు హైకోర్టు న్యాయమూర్తులు చేరుకున్నారు. జిల్లా కోర్టులో పని చేసే న్యాయమూర్తులు, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇతర అధికారులతో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన న్యాయమూర్తులు, అధికారులతో వారు బృంద చిత్రాలు దిగారు. ఈ క్రమంలో ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను జిల్లా కోర్టు న్యాయమూర్తులు, అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆత్మీయంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు.




## తిరుముల మెడికవర్ హాస్పిటల్‌లో ఉచిత లివర్ ఫైబ్రో స్కాన్

**విజయనగరం ఏప్రిల్ 18 (జయ జయహే )**

తిరుమల మేడి కవర్ హాస్పిటల్‌లో నిర్వహించిన పత్రిక సమావేశం లో గ్యాస్ట్రోఇంట్రలాజిస్ట్ మరియు హేపటాలజిస్ట్ డా. దుర్గా సాయికుమార్ కీలక ప్రకటన చేశారు. వరల్డ్ లివర్ డే ఏప్రిల్ 19 సందర్భంగా ప్రజల లివర్ ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాధారణంగా రూ. 8000 ఖర్చయ్యే లివర్ ఫైబ్రో స్కాన్‌ను ఏప్రిల్ 21, మంగళవారం నాడు ఉచితంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పరీక్షను ఎవరైనా వినియోగించుకోవచ్చని, లివర్ సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించడానికి ఇది ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పరీక్షకు హాజరయ్యే వారు కనీసం నాలుగు గంటలు ఫాస్టింగ్‌లో ఉండాలని డా. రెడ్డి దుర్గా సాయికుమార్ సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ లివర్ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని ఆయన కోరారు.



## పల్లాకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర కార్యదర్శి రత్నకుమారి

**విశాఖపట్నం, ఏప్రిల్ 18, జయ జయహే :**

టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా పల్లా శ్రీనివాస్ రెండో సారి నియమితులవడం పట్ల శుభాకంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా టీడీపీ సీనియర్ నాయకురాలు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి శనివారం శ్రీనివాస్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. అయితే తాజా కార్యవర్గంలో రత్నకుమారికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పదోన్నతి కల్పించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస్ కూడా ఆమెకు అభినందనలు తెలిపారు.

## సాగర్ నగర్‌లో ఘనంగా

# మదర్సా-ఎ-అమన్ ప్రారంభోత్సవం

### ఆధ్యాత్మికతతో పాటు విద్యాభివృద్ధికి నూతన వేదిక





**విశాఖపట్నం, ఏప్రిల్ 18, జయ జయహే**

విశాఖ సాగర్ నగర్ ప్రాంతంలో మస్జిద్-ఎ-అమన్ ప్రాంగణంలో "మదర్సా-ఎ-అమన" ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వైఎసఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఐ హెచ్ ఫారూఖీ, 53వ వార్డు మాజీ కార్పొరేటర్ బర్కత్ అలీ, 66వ వార్డు మాజీ కార్పొరేటర్ ఇమ్రాన్ సంయుక్తంగా ప్రారంభించి మదర్సా కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో విద్యా ప్రగతితో పాటు నైతిక విలువలను పెంపొందించడంలో మదర్సాల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీపీ కాలనీ అల్-మదీనా మస్జిద్ ముఫ్తీ జనాబ్ అబ్దుల్ ఖయ్యూం సాహెబ్ మాట్లాడుతూ మదర్సాల అవసరాన్ని చెబుతూనే, యువతలో ఇస్లామిక్ విద్యతో పాటు సాంప్రదాయ మరియు ఆధునిక విద్య కలగలిపి అందించడం ద్వారా సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మదర్సాలు కేవలం మతపరమైన విద్యకే పరిమితం కాకుండా, మంచి వ్యక్తిత్వం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతల పెంపొందింపులో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వై ఎస్ ఆర్ సిపి మైనారిటీ సెల్ జెనరల్ సెక్రటరీ, మాజీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ కె వి బాబా,అల్-హాజ్ అహ్మదుల్లా ఖాన్, తారా మస్జిద్ అధ్యక్షులు ఎంఏ రజాక్, అల్-మదీనా మస్జిద్ అధ్యక్షులు జనాబ్ రాహీ , డాక్టర్ ఖాదర్ బాబా, మహమ్మదియా మస్జిద్ కార్యదర్శి గులామ్ ముస్తఫా తదితర ప్రముఖులు పాల్గొని మదర్సాల ప్రాముఖ్యత, సమాజంలో వాటి అవసరం, విద్యా సేవల విస్తరణపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అధ్యక్షుడు జనాబ్ అబ్దుల్ ఖుద్దూస్, కార్యదర్శి జనాబ్ అల్లా బక్షి,కోశాధికారి అమీన్, ఉపాధ్యక్షులు సయ్యద్ గౌస్,షానవాజ్, అమీర్ మరియు కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. వారి కృషిని హాజరైన అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. జగదాంబ ప్రాంతంలోని మక్కా మస్జిద్‌కు చెందిన హాఫీజ్-ఎ-ఖురాన్ హాజీ బసిరుల్ ఖాద్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మదర్సా-ఎ-అమన్ విజయవంతంగా కొనసాగాలని, విద్యా సేవలు మరింత విస్తరించాలని, సమాజానికి మరింత సేవ చేయాలని ప్రార్థించారు.

## భూముల మార్కెట్ విలువ పెంచే ప్రతిపాదన

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**(:జయ జయహే)**

త్వరలోనే భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు భూముల ధరల పెంపు జరగలేదని, త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో కొత్త పాలసీ తీసుకురావడానికి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. అలాగే కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతోందని, అది విడతల వారీగా జరిగే అవకాశం ఉందని తెలిపారు.ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమస్యలను 'భూ-భారతి' ద్వారా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. చిట్‌చాట్‌లో పలు కీలక అంశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భూముల ధరల పెంపు, రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు, రెవెన్యూ పాలసీ వంటి విషయాలపై స్పష్టత ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ, భూముల రిజిస్ట్రేషన్‌ను మ్యాప్‌తో అనుసంధానం చేస్తూ ఈ నెల 20వ తేదీ నుంచి కొత్త విధానం ప్రారంభమవుతుందని చెప్పారు. మ్యాప్‌తో కూడిన తొలి రిజిస్ట్రేషన్ పాలేరు ప్రాంతంలో ప్రారంభం కానుందని తెలిపారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ కూడా త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. సమ్మర్ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. అసైన్డ్ భూములపై వచ్చిన ఫిర్యాదులను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే నాలుగు రకాల ఫిర్యాదులను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. ఏ శాఖ ఎవరికీ శాశ్వతం కాదని, శాఖలపై ఆశలు పెట్టుకోవడం సహజమని మంత్రి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో తనపై ప్రతిపక్షం విమర్శలు చేసినప్పుడు ఇతర మంత్రులు తనకు మద్దతుగా నిలిచారని తెలిపారు. ప్రతిపక్షం ట్రాప్‌లో పడకుండా ఓపికగా సమాధానాలు ఇచ్చానని అన్నారు. ఇక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై లిస్ట్ తయారు అవుతోందని, సరైన సమయంలో అన్ని విషయాలు బయటకు వస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



## రిజిస్ట్రేషన్ల ఆదాయం అభివృద్ధికి నిదర్శనం: గంటా

**మధురవాడ, ఏప్రిల్ 18 (:జయ జయహే)**

రిజిస్ట్రేషన్ల ఆదాయం ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి అద్దం పడుతుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.320 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఈ సందర్భంగా శనివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కేక్ కట్ చేసి అధికారులను ఆయన అభినందించారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఐటీ.. రియల్ ఎస్టేట్ సంస్థలు.. టూరిజం ప్రాజెక్టులు వస్తున్న నేపథ్యంలో కొనుగోళ్లు, అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 15 వేల లావాదేవీలు జరిగాయని, మధురవాడ పరిసరాల్లో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. హైరైజ్ భవంతులే కాకుండా విల్లాల నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని.. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎండాడ స్కై లాంజ్, ఐకానికా గ్రాండ్, వీపీఆర్ ప్రాజెక్టుల ద్వారానే రూ. 400 కోట్ల ఆదాయం వస్తుందన్న అంచనా రాబోయే రోజుల్లో రియల్ ఎస్టేట్ బూమ్ కళ్ల ముందు ఉంచుతుందని చెప్పారు. ఆదాయంలో మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నెంబర్ వన్ గా నిలిపిన జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి ఇతర సిబ్బందిని గంటా అభినందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, పిల్లా వెంకట్రావు, మన్యాల సోంబాబు, లొడగల అప్పారావు, చెట్టుపల్లి సన్యాసిరావు, నాగోతి సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, గరే గుర్నాథ్, కానూరు అచ్యుతరావు, వాండ్రాసి అప్పలరాజు, బోయి శ్రీను, పోలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

### వార్డుల్లో పర్యటించి, పేషెంట్స్‌తో మాట్లాడి వైద్య సేవలపై ఆరా





**కాకినాడ జయ జయహే**

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శనివారం ఆకస్మికంగా కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్.. జీజీహెచ్ వైద్య అధికారులతో కలిసి జీజీహెచ్ లో వివిధ వార్డుల్లో పర్యటించారు. వార్డులలోని వసతులను పరిశీలించి, పేషెంట్స్ తో మాట్లాడి ఆసుపత్రి ద్వారా అందుతున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్.. జీజీహెచ్ లో వంగా గీత బ్లాకులోని ఎమర్జెన్సీ వార్డు, నూతనంగా నిర్మించిన డ్రామా కేర్, మెడికల్ వార్డు, సర్జికల్ వార్డులో గుండె జబ్బులు, ఆర్థోపెడిక్ వార్డులను పరిశీలించి, చికిత్స పొందుతున్న వారితో మాట్లాడు ఆసుపత్రిలోని సదుపాయాల వివరాలు ఆరా తీశారు. అనంతరం రక్త నమోనాల పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి నిర్మాణంలో ఉన్న ఎంసీహెచ్ తోబ్లాక్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి తల్లిపిల్ల బ్లాక్ లోని మెటర్నిటీ, కుటుంబ నియంత్రణ వార్డులు, ఈఎన్టీ బ్లాకు మీదుగా అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ కింద ఉన్న వార్డులను జిల్లా కలెక్టర్ పరిశీలించి, వైద్య అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. జీజీహెచ్ కు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలతో పాటు వార్డులలో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచాలని ఆయన ఆదేశించారు. మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ వైద్య అధికారులకు సూచించారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నీటి సమృద్ధ ఆంధ్ర ప్రదేశ్ అవగాహన

**చోడవరం ఏప్రిల్ 18 జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకము ఆధ్వర్యంలో " నీటి సమృద్ధ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి కిరణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమశీలో రాష్ట్ర ప్రభుత్వము ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర" ప్రతి నెల మూడవ శనివారంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో నీటి సమృద్ధి నిల్వలు- వాటి వినియోగము అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు కళాశాల ప్రాంగణశీ లో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, వ్యర్థముగా వచ్చు వాన నీటి గుంతలు, వాన నీరు పెంపుట కొరకు మొక్కల నిర్వహణ తదితర విషయాలపై ప్రీన్సిపల్ విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించి సీనియర్ అధ్యాపకులు వి అప్పలనాయుడు, డాక్టర్ కృష్ణారావు, బహుమతులు ప్రధానం చేశారు.ఆంగ్ల అధ్యాపకులు హెచ్వో డి డాక్టర్ మల్లి బాబు, సమన్వయకర్త డాక్టర్ నారాయణ మూర్తి, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డి.మాల్యాద్రి,బి.పిచ్చమ్మ, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ సూర్యవతి, డాక్టర్ సంధ్యశ్రీ, డాక్టర్ వాసు దేవరాజు,డాక్టర్ శ్రీవెంకటేష్,సరస్వతీ, రామలక్ష్మి, కోమల, కామర్స్ శ్రీనివాసరావు, డాక్టర్ సంతోష్, హేమ గణేష్,ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.




## మండుటెండలో బడి పిలుస్తుంది

### విద్యార్థులు ఎన్రోల్మెంట్ పై ప్రత్యేక దృష్టి

**మాడుగుల,ఏప్రిల్ 19 జయ జయ హే**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండుటెండను కూడా లెక్కచేయకుండా ఉపాధ్యాయులు ఎవరు కృషి చేస్తున్నారు. మండలంలో గల అన్ని ప్రభుత్వ పాఠశాల పరిధిలో ఇంటింటి ప్రచారాలు, వీధి ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను జరిపించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ సందర్భంగా కరపత్రాలు అందజేస్తూ ప్రభుత్వ పాఠశాలలకు ప్రైవేటు పాఠశాలలకు గల వ్యత్యాసాన్ని వివరిస్తున్నారు. ఫీజు రహిత ఉచిత విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను విద్యాబోధన ఆంగ్ల తరగతులు వంటి వివిధ విషయాలను విద్యార్థులు తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. శనివారం మాడుగుల మండలంలో మాడుగుల, కేజాపురం, గాదిరాయి, ఎంకోడూరు, వీరనారాయణశీ, వీరవెల్లి వంటి వివిధ గ్రామాలలో ర్యాలీలు నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ బడులలో చేర్పించాలని కొరారు. ఎంఈఓ లు వేములమ్మ ఈశ్వరరావులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.



## ఈనెల 23న మోదమ్మ ఆలయ ప్రతిష్ట మహోత్సవం

### మాజీ డిప్యూటీ సీఎంకు ఆహ్వానం

**మాడుగుల ఏప్రిల్ 18 ,జయ జయ హే**

మాడుగుల మండలం గాదిరాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ మోదకొండమ్మ వారి ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఈ నెల 23న నిర్వహించనునట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కు ఆహ్వాన పత్రికను కమిటీ ప్రతినిధులు అందజేశారు.ఆరోజు ఉదయం 7:49 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట నిర్వహించబడనని అనంతరం ప్రత్యేక పూజలు చేపడుతమన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 29న శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవం కూడా నిర్వహిస్తున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమాలన్ని విజయవంతం చేయాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచ స్థాయికి ఏయూ ఖ్యాతి




### అనుబంధ కాలేజీలకు మార్గనిర్దేశం చేయాలి

### బోధన సిబ్బందికి శిక్షణ కల్పించాలి

### శతాబ్ది వేడుకల్లో లావు రత్తయ్య

**విశాఖపట్నం, ఏప్రియల్ 18, జయ జయహే**

ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రపంచ స్థాయిలో ఖ్యాతి గాంచిందని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఏయూ అనుబంధ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాల వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుబంధ కళాశాలలకు మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం విశ్వవిద్యాలయంపై ఉందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో తాను భాగం కావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. విశ్వవిద్యాలయ అభ్యున్నతికి కృషిచేసిన అందరినీ మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ ఉన్న ప్రతీ భవనం వెనుక ఒక స్ఫూర్తి నిండి ఉంటుందన్నారు. జాతీయ స్థాయిలో ప్రముఖులను తీర్చిదిద్ది అందించిన ఘనత ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఉ ందన్నారు. అనుబంధ కళాశాలలను మరింత పటిష్టం చేసే దిశగా విశ్వవిద్యాలయం కృషి చేయాలన్నారు. అనుబంధ కళాశాలల బోధన సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, ఎఫ్‌డిపిలను నిర్వహించాలని, పరిశోధన పత్రాల రచన, వర్క్‌షాప్‌లలో వీరిని భాగం చేయాలని సూచించారు. ఉన్నత విద్యశాఖ కమిషనర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్త మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ప్రగతిలో ఏయూ కృషి ఉందన్నారు. యూనివర్సిటీ ప్రతిష్టను పెంచే విధంగా యువత నడచుకోవాలని, ఉ న్నతంగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. విద్యార్థులు ఏయూ నిర్వహించే అన్ని కార్యక్రమాలలో భాగం కావాలన్నారు. ఈ నెల 27న ఘనంగా వేడుకలు జరుపుకుందామని, దీనిలో అంతా భాగం కావాలని పిలుపునిచ్చారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ భవిష్యత్ యువతరానిదేనన్నారు. ఉన్నతమైన కలలు కనడం, వాటిని సాకారం చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర యువతతోనే సాధ్యపడతాయన్నారు. అనుబంధ కళాశాలల విద్యార్థులకు సైతం ఇంటర్న్‌షిప్‌లను అందిస్తామన్నారు. అనుబంధ కళాశాలలు ఏయూలో అంతర్భాగమన్నారు. చారిత్రక క్షణాలలో ఏయూ అనుబంధ కళాశాలు, విద్యార్థులు భాగం కావడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఏయూ సిడిసి డీన్ ఆచార్య టి.వెంకట కృష్ణ, ఏసిఎంఏ అధ్యక్షులు పైడా కృష్ణ ప్రసాద్ , కార్యదర్శి జె.రమణాజి, గౌరవ అధ్యక్షులు టి.బలరామ కృష్ణ తదితరులు ప్రసంగించారు. అనంతరం సుదీర్ఘ కాలం సేవలు అందించిన ప్రిన్సిపాల్స్, అనుబంధ కళాశాలల విశిష్ట పూర్వ విద్యార్థులకు సత్కారాలు చేసారు. అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రధానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అత్యుత్తమ ప్రదర్శనలు, విద్యార్థుల ప్రతిభకు తార్కాణంగా నిలచాయి. అనంరతం అనుబంధ కళాశాలల కరస్పాండెంట్‌లు ప్రసంగాలు అందించారు.

## లోక్‌సభలో బిజెపి కుట్ర బట్టబయలు

### వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

**గుంటూరు (జయ జయహే)**




లోక్ సభలో కుట్రపూరితంగా మహిళ బిల్లుతోపాటు రాజ్యాంగ సవరణ బిల్లును ఒకేసారి ప్రవేశపెట్టి చట్టసభలల్లో 1/3 వంతు మహిళా ప్రాతినిధ్యానికి అవకాశం లేకుండా చేసిన బిజెపి ప్రభుత్వ కుట్రను దేశ ప్రజలందరూ గమనిస్తున్నారని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఈనెల 18వ తేదీ జన చైతన్య వేదిక హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. విపక్ష పార్టీలన్నీ ఏకత్రాటిపై నిలిచి మహిళా బిల్లును విడిగా ప్రవేశపెడితే సంపూర్ణంగా తోడ్పాటును అందిస్తామని ప్రకటించినా మోడీ ప్రభుత్వం తిరస్కరించి డీలిమిటేషన్ బిల్లుతో కలిపి మహిళ బిల్లును లోక్ సభలో ప్రవేశ పెట్టడంతో 2/3 వ వంతు మెజారిటీ సాధించలేక ఘోరంగా విఫలమైందన్నారు. 2021 లో నిర్వహించవలసిన జనగణన ను 2026 వరకు వాయిదా వేసి మహిళా రిజర్వేషన్ నుకు తిలోదకాలు ఇచ్చారన్నారు. 1996లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లు అనేక ఆటంకాలను ఎదుర్కొని 2023లో లోక్ సభ, రాజ్యసభ ఆమోదంతో పాటు రాష్ట్రపతి ఆమోదం పొంది 2029 లోక్ సభ ఎన్నికల నుండి మహిళ రిజర్వేషన్ అమల్లోకి వచ్చేటట్లు కృషి చేశారు. ఇప్పటికైనా డీలిమిటేషన్ తో 2026 జనాభా లెక్కలతో సంబంధం లేకుండా 2029 లో జరిగే లోక్ సభ ఎన్నికలలో మహిళలకు 3 వవంతు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. లోక్ సభలో రాజ్యాంగ సవరణ దిగిపోయిన వెంటనే బిజెపి మహిళ ఎంపీలు ప్లే కార్డులను ఎలా ప్రదర్శించారని ప్రశ్నించారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఎన్నికలలో మహిళల ఓట్లకు గా లం వేయడానికి చేసిన కుట్రగా అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ పై చట్టసభల్లో ప్రాతినిత్యం వహిస్తున్న అన్ని రాజకీయ పార్టీలతో, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అఖిలపక్ష సమావేశాలు నిర్వహించకుండా,ఎలాంటి చర్చలు జరపకుండా 5 రాష్ట్రాలలో ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా హడావిడిగా డీలిమిటేషన్, మహిళా బిల్లుతో రాజ్యాంగ సవరణ పెట్టి అభాసు పాలైందన్నారు. బిజెపి ప్రభుత్వం మహిళ రిజర్వేషన్ ను డీ లిమిటేషన్లకు ముడి పెట్టడం సరికాదన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే రాజ్యాంగ సవరణ కేంద్ర ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఈ బిల్లులను తిరస్కరించడం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విజయంగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ లోని కూ టమి ప్రభుత్వం దుర్మార్గమైన రాజ్యాంగ సవరణలను బలపరుస్తున్నటాన్ని తీవ్రంగా ఖండించారు.




## ఏయూ శతాబ్ది ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి

### విశిష్ట అతిధిగా భారతరత్న సచిన్ టెండూల్కర్

### 27న ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిర్వహణ

### వీసీ జి.పి రాజశేఖర్ వెల్లడి

**విశాఖపట్నం, ఏప్రియల్ 18, జయ జయహే :**

ఆంధ్రవిశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిధిగా ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ హాజరవుతారని ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తెలిపారు. శనివారం ఉ దయం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి గౌరవ అతిధిగా భారతరత్న సచిన్ టెండూల్కర్ హాజరు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, విద్యశాఖ మంత్రి నారా లోకేష్ తదితరులు పాల్గొంటారన్నారు. ఈ నెల 27వ తేదీన ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో దాదాపు 25 వేల మంది విద్యార్థుల సమక్షంలో శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో కలిసి కార్యక్రమ నిర్వహణకు వర్కింగ్ కమిటీని నియమించడం జరిగిందన్నారు. ఈ నెల 26న ఏయూ 100వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుతున్నామన్నారు. దీనిలో భాగంగా బీచ్‌రోడ్డు ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా విద్యార్థులు, తల్లిదండ్రులు, నగరవాసులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలలో, నగరంలో పలు చోట్ల హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న 15 సంవత్సరాల కాలలో నిర్వహించాల్సిన కార్యక్రమాలతో ప్రత్యేక మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసి అమలు చేయడం జరుగుతుందన్నారు . కార్యక్రమాలలో భాగంగా విశిష్ట అతిధుల ప్రసంగాలు, విశిష్ట స్థానాలలో నిలిచిన పూర్వ విద్యార్థులకు సన్మానాలు. అవగాహన ఒప్పందాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నిపుణుల ప్రసంగాలు వంటివి ఉంటాయి. విలేకరుల సమావేశంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికతను వినియోగించుకోవాలి: గంటా








**ఆనందపురం, ఏప్రిల్ 18:( జయ జయహే)**

ప్రభుత్వ కార్యకలాపాల్లో సాంకేతికతను వాడుకోవడం ద్వారా ప్రజలకు చేరువ కావాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండల కార్యాలయంలో శనివారం 135 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సమర్థంగా అందించడానికి రూ. 20 లక్షలు ఖర్చు చేసి ఫోన్లను అందిస్తున్నామన్నారు. అలాగే స్వయం ఉపాధి కోసం 13 ఎగ్ కార్ట్ లను పంపిణీ చేసినట్టు వెల్లడించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో సీఎం చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా పాల్గొంటున్నారని చెప్పారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలందరూ పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా గొట్టిపల్లి గ్రామానికి ట్రాక్టర్ అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాల్లో పారదర్శకత కోసం సాంకేతికతను వాడుకోవాలని సీఎం దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ.. విశాఖలో గూగుల్ డేటా సెంటర్.. లతో ఐటీ విప్లవంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, ఎంపీడీఓ జానకి, ఎమ్మార్వో శ్రీనుబాబు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, రామానాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, కాళ్ల నగేష్ కుమార్, కసిరెడ్డి దామోదరరావు, లొడగల వెంకటరమణ, తమ్మిన అప్పలరాజు, సత్య వరప్రసాద్, లొడగల వెంకట్రావు, మహంతి శివాజీ, రౌతు నాగరాజు, ఎర్ర రాజు, అప్పల రాము తదితరులు పాల్గొన్నారు.

**చెరువును సందర్శించిన గంటా**

రూ. 50 లక్షలతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించిన ఆనందపురం మండలంలోని పోలవాని చెరువును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, బ్యూటిఫికేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పరిసర ప్రాంత ప్రజలు ఆహ్లాదం కోసం వచ్చేలా చెరువు అభివృద్ధి పనులు డిజైన్ చేయాలన్నారు.



# ఫైర్ సేఫ్టీ కట్టుదిట్టం

### ఆకట్టుకున్న మెగా ఫైర్ సర్వీస్ డెమో

### అత్యాధునిక పరికరాలు , టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం

### ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఫైర్ సిబ్బంది విధులు నిర్వహణ

### పరిశ్రమల్లో చిన్న చిన్న ప్రమాదాలు కూడా జరగకూడదు

### అగ్నిమాపక వారోత్సవాల్లో హోం మంత్రి అనిత

**విశాఖపట్నం, ఏప్రిల్ 18, జయ జయహే**

జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా విశాఖలోని ఆర్‌కే బీచ్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫైర్ సర్వీసెస్ విభాగానికి చెందిన డైరెక్టర్ పి.వి. రమణ,అడ్మిన్ డైరెక్టర్ మురళి పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వహించిన మెగా ఫైర్ సర్వీస్ డెమో అతిథులు, నగరవాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలు, ఆస్తులను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పోషించే కీలక పాత్రను అధికారులు వివరించారు. అలాగే వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను హోం మంత్రి అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అగ్ని ప్రమాదాల సమయంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను డెమోల ద్వారా వివరించామని చెప్పారు. 2018లో అగ్నిమాపక శాఖకు పరికరాలు కొనుగోలు చేశామని, 2019 నుంచి 2024 వరకు గత ప్రభుత్వం ఈ విభాగాన్ని పట్టించుకోలేదని ఆమె విమర్శించారు. తాజాగా రూ.232 కోట్లతో ఫైర్ వాహనాలను కొనుగోలు చేశామని, వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని వెల్లడించారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్లను కూడా ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎక్కడైనా విపత్తు సంభవించినప్పుడు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అగ్నిమాపక సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని ఆమె ప్రశంసించారు. హుద్‌హుద్ తుఫాను సమయంలో అలాగే విజయవాడలో బుడమేరు ఘటనలో కూడా ఫైర్ సిబ్బంది చేసిన సేవలను గుర్తు చేశారు. పరిశ్రమల్లో చిన్నపాటి ప్రమాదాలు కూడా జరగకూడదని, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫైర్ సిబ్బందికి అన్ని రంగాల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.



## సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన ఉద్యోగులు వినతి

**విశాఖపట్నం ఏప్రిల్ 18 జయ జయహే**

విశాఖ అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం శనివారం జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ని హైదరాబాద్ వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశాఖ పట్నం జిల్లాలో వివిధ కంపెనీల/ విభాగాల ఆదివాసీ ఉద్యోగుల న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒక వినతిపత్రం అందజేశారు. వాటిని సత్వరమే పరిష్కారం చేయాలని కోరారు. స్పందించిన కమిషన్ సభ్యులు మీ సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు సొనాయి అప్పలరాజు,ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్, రాథోడ్,సమరెడ్డి బాల గంగాధర్ తిలక్, సీసా శోభన్, జంపరంగి రాము,కొండగోరి ప్రసాద రావు, ఓలేసు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.




## ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది వేడుకల్లో.. సౌజన్య చింతాకు ప్రతిష్ఠాత్మక పురస్కారం

**విశాఖపట్నం,జయ జయహే న్యూస్:**

ఆంధ్ర విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో, ఏయూ అనుబంధ కళాశాల అయిన 'యలమర్తి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్' విద్యార్థిని సౌజన్య చింతా మెరిటోరియస్ స్టూడెంట్ అవార్డ్ అందుకోవడం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది.విద్యా ప్రతిభ, అంకితభావం మరియు క్రమశిక్షణతో ఆమె సాధించిన ఈ విజయం, విశ్వవిద్యాలయ శతాబ్ది వేడుకల వంటి చారిత్రాత్మక వేదికపై దక్కడం ఆమె విద్యా ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రతినిధులు మాట్లాడుతూ..నాణ్యమైన విద్య, విలువలతో కూడిన బోధన అందిస్తున్న తమ సంస్థ విద్యార్థులు ఇలాంటి ప్రతిష్ఠాత్మక వేదికలపై రాణించడం ఆనందంగా ఉందని, ఈ విజయం ఇతర విద్యార్థులకు కూడా ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి స్ఫూర్తినిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సౌజన్య సాధించిన ఈ గౌరవం,పట్టుదల మరియు కృషి ఉంటే ఏ స్థాయికైనా చేరుకోవచ్చని మరోసారి నిరూపించింది.

For a pure tomorrow.. జయహే



# నోట్లో వేస్తే కరిగిపోయే స్పాంజ్ దోశ

## సింపుల్‌గా ఇలా ప్రిపేర్ చేసుకోండి

చాలా మంది ఎక్కువగా ఇష్టపడే బ్రేక్ ఫాస్ట్ ఐటమ్స్‌లలో ఒకటి.. దోశ. కానీ, ప్రతిసారీ క్రిస్పీ దోశలు తిని బోర్‌గా అనిపిస్తోందా? అయితే, ఈసారి వెరైటీగా 'స్పాంజ్ దోశ'ను ట్రై చేయండి. పోషక విలువలు పుష్కలంగా ఉన్న ఈ దోశ ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తుంది! మరి, దీన్ని ఎలా ప్రిపేర్ చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

మనందరికీ సాధారణంగా బ్రేక్‌ఫాస్ట్ అంటే ఇడ్లీ, పూరీ, బోండా, వడ, దోశ.. వంటివి గుర్తుకొస్తాయి. వీటిల్లో దోశలకు ఫ్యాన్ ఫాలోయింగ్ విపరీతంగా ఉంటుంది. అయితే, ప్రతిసారీ క్రిస్పీ దోశలను తిని బోరింగ్‌గా అనిపించొచ్చు. అందుకే ఈసారి మీకోసం ఒక సరికొత్త రెసిపీ తీసుకొచ్చాం. అదే.. "పోహా దోశ". దీనినే స్పాంజ్ దోశ అని కూడా అంటారు. ఈ రెసిపీ మహారాష్ట్ర, బెంగళూరులలో చాలా ఫేమస్. పైగా దీనికోసం ఎక్కువ పడాల్సిన పనిలేదు. చాలా సింపుల్‌గా తక్కువ సమయంలోనే ప్రిపేర్ చేసుకోవచ్చు. పైగా దీనిని తీసుకోవడం వల్ల శరీరానికి ఫైబర్, ఐరన్ లాంటి పోషకాలు అందుతాయి. మరి, ఈ సూపర్ హెల్దీ రెసిపీ కోసం కావాల్సిన పదార్థాలేంటి? ఎలా తయారుచేసుకోవాలి? అనే వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**కావాల్సిన పదార్థాలు :**

రెండు కప్పులు - బియ్యం
అరకప్పు - పోహా
ఒక స్పూను - మెంతులు
రెండు కప్పులు - పెరుగు
రుచికి సరిపడా - నెయ్యి
రుచికి తగినంత - ఉప్పు

**పోహా దోశ తయారీ విధానం :**

ఇందుకోసం ముందుగా బియ్యం, మెంతులను శుభ్రంగా కడగాలి. ఇప్పుడు ఒక గిన్నెలో కొన్ని గోరువెచ్చని వాటర్ తీసుకొని అందులో వాటిని వేసి రెండు గంటల పాటు నానబెట్టుకోవాలి.

అలాగే మరో బౌల్‌లో అటుకులను కూడా బాగా కడిగి నానబెట్టుకోవాలి.

రెండు గంటల తర్వాత బియ్యం, మెంతుల మిశ్రమాన్ని వడకట్టి మిక్సీ జార్‌లోకి వేసుకోవాలి. ఆపై కొద్దిగా వాటర్ యాడ్ చేసుకొని చిక్కటి పేస్ట్‌లా మిక్సీ పట్టుకోవాలి.

ఆవిధంగా పట్టుకునేటప్పుడు మధ్యలో నానబెట్టుకున్న అటుకులను కూడా యాడ్ చేసుకొని మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి.

ఆ తర్వాత ఆ మిశ్రమాన్ని మరో బౌల్ లోకి తీసుకొని.. పెరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసుకొని బాగా కలిపి దోశ పిండిలా ప్రిపేర్ చేసుకోవాలి.

అయితే, పిండి మరీ జారుడుగా కాకుండా కాస్త చిక్కగానే ఉండేట్లు చూసుకోవాలి.

ఇప్పుడు స్టౌపై దోశ పెనం పెట్టుకొని వేడి చేసుకోవాలి. అది కాస్త హీట్ అయ్యాక నెయ్యి అప్లై చేసుకొని కొద్దిగా పిండిని తీసుకొని మందపాటి దోశలా వేసుకోవాలి. ఎందుకంటే.. మరీ పలుచగా వేసుకుంటే క్రిస్పీలా వచ్చేస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

కాబట్టి.. అట్టు మాదిరిగా దోశ వేసుకున్నాక దానిపై కొద్దిగా నెయ్యిని చల్లుకొని మీడియం సైజు మంటపై రెండువైపులా కాల్చుకోవాలి. అంతే.. ఎంతో టేస్టీగా, మెత్తగా మృదువుగా ఉండే "స్పాంజ్ దోశ" రెడీ!

ఈ దోశల్ని కొబ్బరి చట్నీ/పల్లీల చట్నీ, సాంబార్‌తో కలిపి తీసుకుంటే ఎంతో రుచిగా ఉంటాయి. మరి, ఇంకెందుకు ఆలస్యం మీరూ ఓసారి ఈ పోహా దోశను ట్రై చేయండి!

# మైనారిటీలకు అండగా ప్రభుత్వం

## విజయవాడలో హజ్ భవన్ నిర్మిస్తాం

## హజ్ యాత్రికులను కోరిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్






**అమరావతి, ఏప్రిల్ 18 (జయ జయహే )**

రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటూ అండగా నిలుస్తున్నదని రాష్ట్ర మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి మొదటి దశలో 156 మంది యాత్రికులు హజ్ యాత్రకు బయలుదేరారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున గన్నవరం వద్ద ఎస్ఎం కన్వెన్షన్ సెంటర్లో హజ్ యాత్రికులకు విడిది సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. మైనారిటీ సంక్షేమ శాఖ నేతృత్వంలో రాష్ట్ర హజ్ కమిటీ పర్యవేక్షణలో విడిది కేంద్రం నుంచి గన్నవరం విమానాశ్రయం వరకు యాత్రికులను తీసుకువెళ్లేందుకు ప్రత్యేకంగా బస్సులు, కార్గో వ్యాన్ల సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. మొదటి దశలో హజ్ యాత్రకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మైనారిటీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహమ్మద్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు.

**మైనారిటీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత- మంత్రి ఫరూక్**

హజ్ యాత్రికులను ఉద్దేశించి మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేనివిధంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 6090 కోట్ల భారీ బడ్జెట్ మైనార్టీల సంక్షేమానికి కేటాయించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. ఇమాములు, మౌజనులకు గౌరవ వేతనాలు ఇవ్వడం జరుగుతున్నదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా షాదిఖానా ల నిర్మాణం, మసీదుల, ఖబరస్థాన్ల మరమ్మతులకు నిధులు ఖర్చు చేయడం జరుగుతున్నదని అన్నారు. ఉర్దూ పాఠశాలల అభివృద్ధి, మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేకంగా శిక్షణ ఏర్పాట్లు, పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ తదితర ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ మైనారిటీల పక్షపాతి ప్రభుత్వంగా కూటమి పాలన సాగిస్తున్నదని అన్నారు. విజయవాడలో అన్ని సౌకర్యాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలతో హజ్ భవన్ నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని, త్వరలోనే నిర్మాణ కార్యాచరణ చేపట్టడం జరుగుతుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించేందుకు దైవానుగ్రహం ప్రసాదించాలని హజ్ యాత్రలో పవిత్ర మక్కా స్థలంలో ప్రార్థించాలని హజ్ యాత్రికులను మంత్రి ఫరూక్ కోరారు. ప్రస్తుత ఏడాదిలో ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 2000మంది హజ్ యాత్రకు బయలుదేరుతున్నారని అన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి రెండు దశల్లో 333 మంది హజ్ కి బయలుదేరుతుండగా, మొదటి దశలో 156 మంది, రెండవ దశలో (19 వ తేదీ, ఆదివారం నాడు)177 మంది మదీనా కు వెళ్తారని మంత్రి ఫరూక్ వెల్లడించారు. గన్నవరం నుంచి బయలుదేరే ప్రతి హజ్ యాత్రికుని కి కూటమి ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం అందించడం జరుగుతున్నదని మంత్రి ఫరూక్ తెలిపారు

# డీలిమిటేషన్‌కు మహిళా బిల్లు ముసుగు

## దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర విఫలం

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**(జయ జయహే )**

నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పార్లమెంట్‌లో దక్షిణ భారతదేశ ప్రాధాన్యాన్ని తగ్గిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఇప్పటికే 2023లో ఆమోదించిందని, ఆ బిల్లుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ముడిపెట్టాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. నియోజక వర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకున్నా, తాజా జనాభా గణనను ప్రాతిపదికగా తీసుకున్నా దక్షిణ భారతదేశం తీవ్రంగా నష్టపోతుందని కేటీఆర్ అన్నారు. ఈ విషయం కేంద్రంలోని పాలకులకు కూడా బాగా తెలుసని చెప్పారు. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని తాజా బిల్లు పొందలేదని స్పష్టంగా తెలిసినప్పటికీ, మోదీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శించారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశ గళాన్ని అణచివేస్తున్న తీరుపై బిఆర్ఎస్ తరపున తాము తీవ్ర ఆందోళనను, నిరసనను వ్యక్తంచేస్తున్నామని కేటీఆర్ చెప్పారు. మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లు ఇప్పటికే ఆమోదం పొందింది కాబట్టి, ఈ దేశ మహిళలకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనుకుంటే ప్రస్తుతం ఉన్న 543 స్థానాలతోనే అమలు చేయవచ్చని చెప్పారు. పార్లమెంటులో దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం 24? స్థానాలు ఉన్నాయని, ఆ 24 శాతం స్థానాలు యథాతథంగా కొనసాగేలా చూడాలని అన్నారు. ఒకవేళ దక్షిణ భారత ప్రాధాన్యాన్ని 24 శాతం కంటే తగ్గిస్తే ఈ దేశ నిర్మాణంలో విశేష కృషిచేసిన దక్షిణ భారత ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, ఆగ్రహం వ్యక్తమవుతాయని కేటీఆర్ హెచ్చరించారు.


# గదుల్లో దాచిన స్పై కెమెరాలను గుర్తించాలంటే..

## ఈ సింపుల్ ట్రిక్స్ ఫాలో అవ్వండి

సమాజంలో చిన్నా పెద్దా, పేద ధనిక తేడాలేకుండాఅందర్నీ భయపెడుతున్న అంశం సీక్రెట్ కెమెరా. మనకు తెలియకుండానే ఇల్లు, ఆఫీసు, హోటల్ గదుల్లో రహస్యంగా కెమెరాలను అమర్చి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. షాపింగ్‌మాళ్లు, వస్త్ర దుకాణాల్లో ట్రయల్ రూమ్‌కి వెళ్లే ప్రతి మహిళ మదిలో మెదిలే సందేహం ఒక్కటే! గదిలో రహస్య కెమెరాలు ఉన్నాయోమోనని..! ఇలా అమర్చే కెమెరాలను కనుగొనేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. ఈ సింపుల్ ట్రిక్ ఫాలో అయి రహస్య కెమెరా భారీ నుంచి మిమ్మల్ని మీరు కాపాడుకోండి.

అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఎంత మేలు చేస్తుందో అది నిరుపయోగం అయితే అంతే ప్రమాదం కూడా. ఇటీవల కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల అంశం వెలుగు చూసిన తర్వాత ప్రతిఒక్కరిలోనూ దీనిపై ఆందోళన నెలకొంది. గోప్యతకు ముప్పుగా మారింది. అయితే రహస్య కెమెరాలు ఎక్కువగా గోడ గడియారాలు, పవర్ బ్యాంక్‌లు, పిక్చర్ ఫ్రేమ్, అలంకరణ వస్తువులలో అమర్చుతున్నారు. ఈ రహస్య కెమెరాలను గుర్తించడం కొంచెం కష్టమవుతుంది.

ఆన్‌లైన్‌లో అతి తక్కువ ధరకు రహస్య కెమెరాలు లభిస్తుండటం వ్యక్తుల గోప్యత అనేది తీవ్రమైన ప్రమాదంలో పడింది. అయితే మీరేమీ భయపడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతమున్న టెక్నాలజీని ఉపయోగించి.. ఇలాంటి రహస్య కెమెరాను చాలా సులువుగా గుర్తించవచ్చు. ముఖ్యంగా RF డిటెక్టర్లు, కెమెరా లెన్స్ డిటెక్టర్లు, థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు, స్మార్ట్‌ఫోన్‌లు, Wi-Fi స్కానర్ల సహాయంతో రహస్య కెమెరాలను పసిగట్టొచ్చు. అంతే కాదు నేరుగా మన కళ్లతో చూసి కూడా రహస్య కెమెరాలను గుర్తించవచ్చు. అది ఎలాగో ఇప్పుడు తెలుసుకుందాం.



రహస్య కెమెరాలు చట్టవిరుద్ధమా: రహస్య కెమెరాల కొనుగోలు పూర్తిగా చట్టబద్ధమే అయినప్పటికీ, కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. సాధారణంగా ఇంట్లో, పరిసరాల్లో హిడెన్ కెమెరాలను అమర్చుకోవచ్చు. ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే ఇంటిని మరొకరికి అద్దెకు ఇచ్చినప్పుడు, అతిథులు వచ్చినప్పుడు.. వారికి తెలియకుండా రహస్య కెమెరాలను అమర్చడం నేరం అవుతుంది. అలాగే ప్రభుత్వ సంస్థల వద్ద, రక్షణ ప్రాంతాల్లో మన వ్యక్తిగత రహస్య కెమెరాలు అమర్చడం చట్టవిరుద్ధమవుతుంది.

**రహస్య కెమెరాలను గుర్తించడం ఎలా?**

1. నేరుగా కళ్లతో చూడడం: మనకు అనుమానం ఉన్న ప్రాంతంలో నిశితంగా గమనించాలి. గోడ గడియారాలు, పూల కుండీలు లాంటి పెద్ద ఆకృతిలో ఉండే వస్తువుల్లో అమర్చే కెమెరాలను జాగ్రత్తగా పరిశీలిస్తే గుర్తు పట్టేయొచ్చు. ఒక వేళ కంటికి కనిపించకపోతే, లేటెస్ట్ టెక్నాలజీ ద్వారా ఆ స్పై కెమెరాలను గుర్తించవచ్చు

2. రేడియో ఫ్రీక్వెన్సీ డిటెక్టర్లు: కంటికి కనిపించని కెమెరాలను గుర్తించడానికి RF డిటెక్టర్ ఉపయోగపడుతుంది. స్పై కెమెరాల నుంచి తరచుగా వెలువడే రేడియో తరంగాలను గ్రహించడం ద్వారా RF టిటెక్టర్ వాటిని గుర్తిస్తుంది. చాలా కెమెరాలు 500MHz నుంచి 6GHz వరకు రేడియో తరంగాలను ప్రసారం చేస్తాయి. స్కాన్ చేయడం ద్వారా డిటెక్టర్లు ఈ హిడెన్ కెమెరాలను పసిగడతాయి.

3. కెమెరా లెన్స్ డిటెక్టర్లు: కొన్ని రహస్య కెమెరాలు తమ ఫీడ్‌ను SD%కార్డ్స్ లాంటి లోకల్ స్టోరేజ్‌ల్లో నిక్షిప్తం చేస్తుంటాయి. ఈ పరికరాలకు రేడియో సిగ్నల్స్ అవసరం లేదు. అయితే ఇలాంటి కెమెరాలను కూడా కెమెరా లెన్స్ డిటెక్టర్లతో గుర్తించవచ్చు. కెమెరా లెన్స్ సాధారణంగా కాంతి ప్రతిబింబాలను క్యాప్చర్ చేస్తుంటాయి. ఇలా చేస్తున్న సమయంలో సెన్సార్ ఆఫ్ అయినట్లయితే, సదరు ప్రాంతంలో రహస్య కెమెరాలు ఉన్నాయని అనుమానించవచ్చు. అప్పుడు నేరుగా సదరు ప్రాంతంలో చెక్ చేసి, రహస్య కెమెరాలు ఉన్నాయో, లేదో చెక్ చేసుకోవాలి. అంతే సింపుల్

4. థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు: సాధారణంగా ఎలక్ట్రానిక్ వస్తువులను ఉపయోగిస్తూ ఉంటే.. అవి వేడెక్కుతాయి. కనుక థర్మల్ ఇమేజింగ్ కెమెరాలను ఉపయోగించి, రహస్య కెమెరాలను గుర్తించవచ్చు. ఉదాహరణకు ల్యాప్‌టాప్‌లను, ఫోన్లను ఎక్కువసేపు ఉపయోగిస్తే వేడెక్కుతాయి. అందువల్ల థర్మల్ ఇమేజింగ్ కెమెరాలు ఉపయోగించి రహస్య కెమెరాల "గుట్టు రట్టు" చేయవచ్చు.

5. స్మార్ట్ ఫోన్: రహస్య కెమెరాలను కనుగొనేందుకు స్మార్ట్‌ఫోన్లు చక్కగా ఉపయోగపడతాయి. రకరకాల యాప్‌ల సహాయంతో రహస్య కెమెరాలను గుర్తించొచ్చు. చీకటిలో రికార్డ్ చేయడానికి కెమెరా లెన్స్‌లకు కొంత ప్రకాశవంతమైన ఫీచర్లు అవసరం. చాలా మంది తయారీదారులు ఇన్‌ఫ్రారెడ్ (%×=%) సాంకేతికత వాడుతుంటారు. ఇది కంటికి కనిపించదు. కనుక మీరు మీ ఫోన్లోని ఫ్రంట్ కెమెరాను ఆన్‌చేసి, చీకటిలో మీ గది మొత్తాన్ని చూడండి. సాధారణ కంటికి కనిపించని, ఏదైనా వెలుగు ఫోన్ కెమెరాలో కనిపిస్తే వెంటనే అది హిడెన్ కెమెరా అని గుర్తించండి.

6. Wi-Fi స్కానర్

మన స్మార్ట్ ఫోన్ ద్వారా వై-ఫై నెట్‌వర్క్‌లను సులువుగా గుర్తించవచ్చు. కనుక దీని ద్వారా మీ ఇంట్లో వై-ఫైతో రన్ అవుతున్న రహస్య కెమెరాలను సులువుగా గుర్తించవచ్చు. అంతేకాదు హ్యాండ్‌హెల్డ్ Wi-Fi, నెట్‌వర్క్ స్కానర్‌ల ద్వారా కూడా రహస్య కెమెరాలను గుర్తించొచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com